RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 236 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

శుక్రవారం 30 । డిసెంబర్ । 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## రాహుల్‌కు సెక్యూరిటీలో ఎక్కడా లోపం లేదు

**కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టిన సిఆర్‌పిఎఫ్**



న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు): రాహుల్ గాంధీకి సరైన రీతిలో సెక్యూర్టీ కల్పించడం లేదని కాంగ్రెస్ పార్టీ చేసిన తీవ్ర ఆరోపణలపై సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ ఘాటుగా స్పందించింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను సీఆర్పీఎఫ్ ఖండించింది. ఇటీవల అనేక సార్లు రాహుల్ గాంధీయే సెక్యూర్టీ ఉల్లంఘనలకు పాల్పడినట్లు

మిగతా... 2లో



మహిళా సాధికారికతను ప్రోత్సహించే

## సమాజం రావాలి


**అదే అభివృద్ధి చెందినదిగా ఉంటుంది**

**నారాయణమ్మ కాలేజీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): ప్రతిస్థాయిలోనూ మహిళా సాధికారికతను ప్రోత్సహించే సమాజం మాత్రమే అసలైన ఆధునిక, అభివృద్ధి చెందిన సమాజంగా భావించబడుతుందని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. జి నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించారు.

కళాశాల రజతోత్సవం, భారతదేశ ఆజాదీ కా అమృత మహోత్సవ్ ను పురస్కరించుకొని విద్యార్థులను ఉద్దేశించి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, జి. కిషన్ రెడ్డి, చైర్మన్ పి. సుబ్బారెడ్డి; జి. పుల్లారెడ్డి ఛారిటీస్ ట్రస్ట్ చైర్మన్ జి రాఘవరెడ్డి, జిఎన్ఐటిఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యా రెడ్డి, జిపిఆర్ ఛారిటీస్ ట్రస్ట్ ట్రస్టీ జి. ఏకాంబర రెడ్డి ,జిఎన్ఐటిఎస్ ప్రిన్సిపాల్ డా. రమేష్ రెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సంవత్సరాల క్రితం ఉఇఓ కోర్సులలోకి ఎక్కువ మంది మహిళలను తీసుకురావాలనే సమగ్ర దృక్పథంతో జి పుల్లారెడ్డి గారు తెలంగాణ, ఏపీ ప్రాంతంలో మొదటి మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించారు. రజతోత్సవ వార్షికోత్సవం సందర్భంగా ఇప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి ఆతిథ్యం ఇవ్వడం మాకు గర్వకారణం అన్నారు. ఎక్కువ మంది మహిళలు అభివృద్ధి చెందకుండా నిరోధించే

మిగతా... 2లో



## నేడు యాదాద్రికి రాష్ట్రపతి ముర్ము

**హెలికాప్టర్‌లో వెళ్లనున్న రాష్ట్రపతి**

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్ కు వచ్చిన రాష్ట్రపతి

మిగతా... 2లో

శాంతిభద్రతల పరిరక్షణకు

## పెద్దపీట



- రాష్ట్రంలో 4.44 శాతం పెరిగిన క్రైమ్ రేటు
- 57 శాతం పెరిగిన సైబర్ క్రైమ్ నేరాలు
- మావోయిస్ట్ రహిత రాష్ట్రంగా తెలంగాణ
- మతఘర్షణలకు తావు లేకుండా చర్యలు
- తెలంగాణ ఇంటిలిజెన్స్ వ్యవస్థ బలోపేతం
- వార్షిక నివేదికను వెల్లడించిన డిజిపి మహేందర్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరిగింది. గతేడాదితో పోలిస్తే 4.44 శాతం క్రైమ్ రేట్ పెరిగినట్లు డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. గురువారం 2022 క్రైమ్ వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... 57 శాతం సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయని తెలిపారు. ఈ ఏడాదిలో 120 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహా సేవలు అందించే లక్ష్యంలో భాగంగా తెలంగాణ శాఖ ముందుకు వెళ్ళిందని చెప్పారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలతో యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లు చేసి విజయవంతం అయినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కమ్యూనల్ గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నా మన్నారు. టెర్రర్ అటాక్ జరకుండా, ముందుగానే పసిగట్టి ఎలాంటి దాడులు జరగకుండా చేశామని చెప్పుకొచ్చారు. సీఐ సెల్, ఇంటెల్‌జెన్స్ వ్యవస్థ చాలా బాగా పని చేసిందని అన్నారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా శాంతి భద్రతలను పరిరక్షిణించామని డీజీపీ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

మిగతా... 2లో

## న్యూ ఇయర్ వేడుకల గిఫ్ట్

**డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు బార్లు బార్లా**

**రాత్రి ఒంటిగంట వరకు మద్యం అమ్మకాలు**



హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో మందుబాబులకు గుడ్‌న్యూస్ దక్కింది. డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంట వరకు బార్లు, రెస్టారెంట్లు, వైన్ షాపులు తెరిచి ఉండనున్నాయి. ఒంటిగంట వరకు మద్యం విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రిటైల్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు, 2బీ లైసెన్స్ గల బార్లు ఒంటి గంట వరకు తెరిచి ఉండనున్నాయి. న్యూయిర్ వేడుకల సందర్భంగా పోలీసులు నిబంధనలు విధించారు. త్రీ స్టార్, ఆపై హోటల్స్, పబ్బులు, క్లబ్బుల వద్ద ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద, పార్కింగ్ ప్రదేశాల్లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసభ్యకర నృత్యాలు, న్యూసెన్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. న్యూఇయర్ వేడుకల్లో శబ్ద తీవ్రత 45 డెసిబెల్స్ మించకూడదని నిబంధన విధించారు. పరిమితికి మించి పాస్‌లు, టికెట్లు జారీ చేయొద్దని ఆదేశించింది.

## ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డా.వేణు

**వ్యవసాయ ప్రాధాన్యం పెరిగిన క్రమంలో నియామకం**



హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కేంద్రమాజీ మంత్రి, మాజీ రాష్ట్ర మంత్రి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పనిచేసిన బిఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో వేణుగోపాలాచారి రెండేండ్ల వరకు కొనసాగనున్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన సముద్రాల

మిగతా... 2లో

కంబోడియా హోటల్‌లో

## ఘోర అగ్నిప్రమాదం

- ఘటనలో 10 మంది మృతి.. 30 మందికి గాయాలు

న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు): కంబోడియాలోని గ్రాండ్ డైమండ్ సిటీ హోటల్ లో ఘోర అగ్ని ప్రమాదం

మిగతా... 2లో





## అధికారమే లక్ష్యంగా...

- తెలంగాణలో గెలుపు లక్ష్యంగా బిజెపి ప్లాన్
- నేతలకు దిశానిర్దేశం చేసిన పార్టీనేత బిఎల్ సంతోష్
- 119 నియోజకవర్గాలకు పాలకుల నియామకం
- శేరిలింగంపల్లికి కిషన్ రెడ్డి, మేడ్చల్‌కు ఎంపీ లక్ష్మణ్
- కుత్బుల్లాపూర్‌కు డీకే అరుణ, పరిగికి విజయశాంతి

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): రాబోయే ఎన్నికలే టార్గెట్‌గా పార్టీని బలోపేతం చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. బూత్ లెవల్ నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు బీజేపీ నాయకత్వం పాలకులను నియమించింది. ఇందులో కనీసం 90 అసెంబ్లీ స్థానాలను బిజెపి టార్గెట్ చేస్తోంది. బీజేపీ అధిష్టానం సూచన మేరకు పాలక్ సభ్యులు నెలలో మూడు రోజుల పాటు నియోజక వర్గాల్లోనే ఉండనున్నారు. నియోజకవర్గాల స్థితిగతులపై ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, సీనియర్లను పాలక్ లుగా నియమించారు. ఈ నేపథ్యంలో వీరందరికి బీజేపీ అధ్యక్షుడు

మిగతా... 2లో



## రిమోట్ వోటింగ్ మెషీన్

- రిమోట్ ఈవీఎంలను ప్రవేశ పెట్టిన ఈసి
- వలస ప్రజలు నేరుగా ఓటేసేలా సౌకర్యం
- కొత్త ఈవీఎంలపై 16న అఖిపక్షంలో వివరణ

న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు): ప్రోటోటైప్ రిమోట్ ఈవీఎంలను అభివృద్ధి చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. వలస ఓటర్లు రిమోట్ ఈవీఎంలతో తామున్న స్వంత ప్రదేశం నుంచే ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఈసీఐ తెలిపింది. మల్టీ కాన్‌స్టిటుయెన్సీ రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ద్వారా..ఒకే పోలింగ్ బూత్ నుంచి వివిధ నియోజకవర్గాలకు ఓట్లు వేసే సౌకర్యం ఉంటుంది. అయితే ఆర్‌వీఎం పనితీరును సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రదర్శన ఇవ్వనున్నది. దీంతో స్వస్థలాలకు వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బందులుపడుతున్న వారికి ఎలక్షన్ కమిషన్ గుడ్ న్యూస్ చెప్పింది. ఈసీ కొత్తగా

మిగతా... 2లో

## రాష్ట్ర ఇంఛార్జ్ డిజిపిగా అంజనీకుమార్


- 31 పదవీ విరమణ చేయనున్న మహేందర్ రెడ్డి
- ఏసీబీ డీజీగా రవి గుప్తా నియామకం
- సీఐడీ అడిషనల్ డీజీపీగా మహేశ్ భగవత్
- రాచకొండ పోలీసు కమిషనర్‌గా డీఎస్ చౌహాన్
- హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా జితేందర్



హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): రాష్ట్ర ఇంఛార్జ్ డీజీపీగా1990 బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ మహేందర్ రెడ్డి పదవీకాలం డిసెంబర్ 31తో ముగియనుండటంతో ఏసీబీ డీజీగా ఉన్న అంజనీ కుమార్‌కు ఇంఛార్జ్ బాధ్యతలు అప్పగించింది. ఇక రాచకొండ పోలీసు కమిషనర్‌గా డీఎస్ చౌహాన్‌ను నియమించారు. రాచకొండ సీపీగా కొనసాగుతున్న మహేశ్ భగవత్‌ను సీఐడీ అడిషనల్ డీజీగా నియామకం అయ్యారు. ఏసీబీ డీజీగా రవి గుప్తా నియామకం కాగా, విజిలెన్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా డీజీగా జితేందర్, లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా సంజయ్ కుమార్ జైన్ నియామకం అయ్యారు. అంజనీకుమార్ బదిలీతో ఖాళీ అయిన ఏసీబీ డైరెక్టర్ జనరల్ పదవికి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న 1990 బ్యాచ్‌కు చెందిన రవి

మిగతా... 2లో

## ప్రజానాడి




సిటీలో న్యూ ఇయర్

## జోష్



- ప్రత్యేక ఈవెంట్స్‌కు సిద్ధం అవుతున్న హోటళ్లు
- ఆంక్షల కొరడాతో సిద్ధంగా ఉన్న పోలీస్ శాఖ

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): న్యూ ఇయర్ జోష్‌కు హైదరాబాద్ సిటీ రెడీ అవుతోంది. ప్రత్యేక ఈవెంట్స్, డీజే మోతలతో సిటీ మారుమోగనుంది. రెండేండ్ల కరోనా గ్యాప్ తర్వాత... పూర్తి స్థాయిలో న్యూ ఇయర్ వేడుకలు జరగనున్నాయి. దీనికి తోడు ఈ ఏడాది డిసెంబర్ 31 శనివారం రావటంతో వీకెండ్ కూడా కలిసి వస్తోంది. దీంతో ఫుల్ గా ఎంజాయ్ చేసేందుకు యువత రెడీ అవుతోంది. వీటికి తగ్గట్టుగానే ప్రత్యేక ఈవెంట్స్ ఏర్పాటు చేస్తున్నారు. యువత న్యూ ఇయర్ వేడుకల హడావుడిలో ఉంటే... పోలీసులు మాత్రం రూల్స్ మస్ట్ అంటున్నారు. చాలా చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం చెప్పే టైంలో బ్లాక్ స్పాట్లలో పోలీసులు తనిఖీలు చేపట్టనున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

మిగతా... 2లో



తెలంగాణ వైద్యరంగంలో

## విప్లవాత్మక మార్పులు

- కాగజ్‌నగర, బెల్లంపల్లి ఆస్పత్రులు ప్రారంభం
- సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కుట్రలు
- జిల్లా పర్యటనలో మంత్రి హరీష్ రావు విమర్శలు

కుమ్రంభీం ఆసిఫాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాగజ్ నగర్ లో రూ. 5 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రిని మంత్రి ప్రారంభించారు. బెల్లంపల్లిలో 100 పడకల నూతన ఆసుపత్రిని, డయాలసిస్ సెంటర్‌ను మంత్రి హరీష్ రావు ప్రారంభించారు.

మిగతా... 2లో




రెండోరోజూ కొనసాగిన

## రైతుబంధు

- 22,45,137 మంది రైతులకు రు. 758,19,25,476 కోట్ల జమ

హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు): వరుసగా రెండోరోజూ రైతుబంధు కింద నిధులు విడులయ్యాయి. అనేక గ్రామాల్లో రైతుల ఖాతాలకు నగదు జమ కార్యక్రమం చురుకుగా సాగుతోంది. పదో విడత రైతు బంధులో భాగంగా రెండో రోజు పెట్టుబడి సాయం నిధులు విడుదలయ్యాయి.

తొలి రోజు ఎకరం చొప్పున 22,45,137 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.758, 19,25,476 కోట్లను

మిగతా... 2లో




తన వియ్యంకుడు, మంత్రి కేటీఆర్ గారి మామగారు పాకాల హరినాథరావు మృతిపట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని రాయదుర్గం వద్ద గల వారి నివాసానికి వెళ్ళి దివంగత హరినాథరావు భౌతిక కాయానికి సీఎం నివాళులర్పించారు. తండ్రిని పోగొట్టుకున్న దుఃఖంతో ఉన్న తమ కోడలు శైలిమను, శోకతప్తులైన కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి దంపతులు ఓదార్చారు. హరినాథరావు ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం కేసీఆర్ భగవంతున్ని ప్రార్థించారు.

## రిమోట్ వోటింగ్ మెషీన్

(మొదటి పేజీ తరువాయి)

డెవలప్ చేసిన రిమోట్ ఓటింగ్ సిస్టమ్ ఉపయోగించి ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఆర్వీఎం ద్వారా ఉపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తమ సొంత నియోజక వర్గాలకు వెళ్లకుండానే ఓటు వేసేలా ప్లాన్ చేస్తోంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. జనవరి 16న రాజకీయ పార్టీలకు డెమో ఇచ్చేందుకు ఈసీ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలు ఈ రిమోట్ వోటింగ్ మిషన్ డెమోకు హాజరుకావాలని ఆహ్వానం పంపింది. లీగల్, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ రిమోట్ ఓటింగ్ సిస్టమ్ అమలుపై ముందుకెళ్లాలని ఈసీ భావిస్తోంది. దేశంలోని చాలా మంది ఓటు వేసేందుకు సొంత నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా మంది ఓటింగ్ కు దూరంగా ఉంటున్నారని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ సమస్యలను అధిగమించేందుకు రిమోట్ ఓటింగ్ సిస్టమ్ ఆలోచన చేసి మెషిన్ ను డెవలప్ చేసింది. ఈ కొత్త ఓటింగ్ మిషన్ తో ఒక పోలింగ్ బూత్ నుంచి 72 వేర్వేరు నియోజకవర్గాలను కవర్ చేసేలా రూపొందించారు. రాజకీయ పార్టీల అంగీకారం తర్వాత ఈ ఇష్యూపై ఈసీ ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 67.4 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. అప్పట్లో దాదాపు 30 కోట్ల మంది ఓటర్లు ఓటింగ్ కు దూరంగా ఉన్నట్లు ఈసీ గుర్తించింది. వీరంతా బయటి ప్రాంతాల్లో స్థిరపడ్డ వారే అని, వీరు ఓటింగ్ లో పాల్గొనేలా ఈ రిమోట్ ఓటింగ్ మెషిన్ ను అభివృద్ధి చేసింది.

### శాంతిభద్రతల పరిరక్షణకు

## పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ నేరాలు 57 శాతం, దొంగతనాలు 7 శాతం, అపహరణలు 15 శాతం పెరిగాయని తెలిపారు. మహిళలపై నేరాలు 3.8 శాతం పెరిగాయని చెప్పారు. హత్య కేసులు 12 శాతం, అత్యాచారాలు 17 శాతం తగ్గాయి. 152 కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడిందని తెలిపారు. డయల్ 100 ద్వారా 13 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా 1.1 లక్షల ఫిర్యాదులు రాగా, పోలీసు స్టేషన్లలో 5.5 లక్షల ఫిర్యాదు నమోదయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. 15 లక్షల మందికి అవగాహన కల్పించామని చెప్పారు. గస్తీ వాహనాలు 7 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకుని సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. హాక్ ఐ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో 10 లక్షలకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా 18,234 కేసులు ఛేదించామని స్పష్టం చేశారు. వేలి ముద్రల ద్వారా ఎంతో మంది నిందితులను గుర్తించామని పేర్కొన్నారు. 10 లక్షల మంది అనుమానితుల వేలి ముద్రలను సేకరించామని తెలిపారు. కరుడుగట్టిన నిందితులపై పీడీ చట్టం ప్రయోగించి నేరాలు అదుపు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 431 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించామని తెలిపారు. విధుల దుర్వినియోగం, క్రమశిక్షణ ఉల్లంఘించిన పోలీస్ ఆఫీసర్స్ పై చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ మహేందర్ రెడ్డి చెప్పారు. దిశ నిందితుల ఎన్కౌంటర్ కేసులో విచారణ పూర్తయిందని స్పష్టం చేశారు. దిశ కమిషన్ రిపోర్ట్ హైకోర్టుకి ఇచ్చిందని, ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. ఎన్కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ముందుకు పోతామని చెప్పారు. ఈ నెల 31 తేదీన తాను రిటైర్డ్ అవుతున్నానని డీజీపీ మహేందర్ రెడ్డి చెప్పారు. తన కెరియర్ లో సహకరించిన అందరికీ ధన్యవాదాలు అంటూ వ్యాఖ్యానించారు. గడిచిన 8 ఏళ్లలో ప్రభుత్వం, మీడియా, ప్రజలు, సిబ్బంది తనకు చాలా సహకరించారని తెలిపారు. మహేందర్ రెడ్డి 2017 నవంబరు 17న తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నియమితుడయ్యారు. ఏప్రిల్ 8, 2020న దేశంలోని టాప్ 25 ఐపీఎస్ అధికారుల జాబితాలో మహేందర్ రెడ్డి 8వ స్థానం దక్కించుకున్నారు.

## అధికారమే లక్ష్యంగా...

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ పలు సూచనలు చేశారు. మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక తయారు చేసుకోవాలని బండి సంజయ్ సూచించారు. దేశానికి బీజేపీ తప్ప మరో పార్టీ లేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. దక్షిణాది రాష్టాల్లో అధికారమే లక్ష్యంగా బీజేపీ ఫుల్ టైమర్స్ మీటింగ్ రెండోరోజు గురువారం కూడా కొనసాగుతోంది. శామీర్ పేటలోని ఓ రిసార్ట్ లో జరుగుతున్న ఈ సమావేశానికి పార్టీ నేషనల్ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ బి.ఎల్.సంతోష్ హాజరయ్యారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ కన్వీనర్లు, ఇంచార్జీలు, విస్తారక్ లు, పాలక్ లతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తరుణ్ చుగ్, బండి సంజయ్, లక్ష్మణ్, ఇతర బిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం అనుసరించాల్సిన కార్యచరణపై నేతలు చర్చిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలు, కేసీఆర్ అవినీతి, కుటుంబపాలన గురించి ప్రజలకు వివరించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ప్రణాళిక రూపొందించారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు పాలక్ లుగా ముఖ్య నేతలను నియమించింది. నెలలో మూడు రోజుల పాటు




నియోజకవర్గాల్లోనే ఉండనున్నారు పాలక్ లు. నియోజకవర్గాల స్థితిగతులపై ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, సీనియర్లను పాలక్ లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నియమించారు. శేరిలింగంపల్లి పాలక్‌గా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మేడ్చల్ పాలక్‌గా ఎంపీ లక్ష్మణ్, కుత్బుల్లాపూర్‌కు డీకే అరుణ పాలక్‌గా నియమితులయ్యారు. జుక్కల్ నియోజకవర్గానికి వివేక్ వెంకటస్వామిని పాలక్‌గా నియమించారు. ఎల్లారెడ్డికి రఘునందన్, రామగండం, మహబూబ్ నగర్‌ల పాలక్ గా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పఠాన్ చెరుకు మురళీధర్ రావు, చేవెళ్లకు జితేందర్ రెడ్డి, పరిగికి విజయశాంతి, ఇబ్రహీంపట్నంకు ప్రకాశ్ రెడ్డి, సిరిసిల్లకు రాణీరుద్రమ, మెదక్ కు ధర్మపురి అర్వింద్ తో పాటు ముఖ్య నేతలకు పాలక్ లుగా బాధ్యతలు బీజేపీ రాష్ట్ర నాయకత్వం అప్పగించింది.

### తెలంగాణ వైద్యరంగంలో

## విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన వైద్య సదుపాయాలు మెరుగుపడ్డాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు తీసేస్తోందని మంత్రి హరీష్ రావు



వెల్లడించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేసే హక్కు తమకు లేదని ప్రధాని మోడీ రామగుండంలో చెప్పితే.. సింగరేణి లోని నాలుగు బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తామని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి చెప్పారన్నారు. మోడీ ఒకలా.. మంత్రి మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని విమర్శించారు. రామగుండం మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు స్పెషల్ రిజర్వేషన్ కల్పించనున్నట్లు హరీశ్ రావు ప్రకటించారు. బెల్లంపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి సరిపడా డాక్టర్లు, సిబ్బందిని త్వరలోనే నియమిస్తామని హామీ ఇచ్చారు. మంచిర్యాల కరీంనగర్ హైదరాబాద్ కి వెళ్లకుండా బెల్లంపల్లిలోనే వైద్య సేవలు అందిస్తామ న్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ లలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు మాత్రమే డయాలసిస్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం తెలంగాణలో 102 డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పామని స్పష్టం చేశారు. కాగజ్‌నగర్‌లో కూడా త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు, మాత శిశువుల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రత్యేకంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను ఇస్తున్నామని అన్నారు. తెలంగాణలో అమలు జరుగుతున్న పథకాలను కేంద్రం కాపీ కొడుతు అమలు చేస్తోందని అన్నారు. త్వరలో 950 డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు కోవలక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ చాహత్ వాజ్‌పాయ్, తదితరులు పాల్గొన్నారు.

## సిటీలో న్యూ ఇయర్ జోష్

(మొదటి పేజీ తరువాయి)

తాగి రోడ్లపై అడ్డగోలుగా డ్రైవ్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. బార్లు, పబ్లు, స్పెషల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్న ఏరియాల్లో మూడు కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలోని బృందాలు 31న రోజంతా డ్యూటీల్లో పాల్గొననున్నారు. 31 రాత్రి నుంచి జనవరి 1న మార్నింగ్ వరకు నెక్లెస్ రోడ్, పీవీఎన్‌ఆర్ ఎక్స్ ప్రెస్ వే, ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు... పలు ప్లై ఓవర్లు మూసివేయనున్నారు. అటు విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు మస్ట్ గా సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించేలా చర్యలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్, బైక్ లపై స్టంట్స్ చేసినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## రెండోరోజూ కొనసాగిన రైతుబంధు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పంపిణీ చేసింది. గురువారం మరో 15.96 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమచేసింది. ఎకరాకు రూ.5 వేల చొప్పున 24,36,775 ఎకరాలకు రూ.1,218.38 కోట్లు బ్యాంక్ అకౌంట్లలో జమచేసింది. ఇప్పటివరకు 9 విడతల్లో సాయం అందించగా, 10వ విడత కింద 70.54 లక్షల మందికి రూ.5 వేల చొప్పున రూ.7,676.61 కోట్లను అందజేయనున్నది. 9 విడతల్లో రైతాంగానికి రూ.57,882 కోట్లు సాయం చేయగా, 10వ విడతతో కలిపి మొత్తం రూ.65,559.28 కోట్లు రైతుబంధు పథకానికి వెచ్చించినట్టవుతుంది. పదో విడత రైతుబంధు ద్వారా ఈ యాసంగి సీజన్‌లో 70.54 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. కాగా, వ్యవసాయ వృద్ధి కోసమే రైతు బంధు పథకమని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కేంద్రంలో రైతు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

### రాష్ట్ర ఇంఛార్జ్ డిజిపిగా

## అంజనీకుమార్

(మొదటి పేజీ తరువాయి)

గుప్తాను ఎంపిక చేసింది. దీంతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రవి గుప్తా ట్రాన్స్‌ఫర్‌తో ఖాళీ అయిన స్థానాన్ని అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న 1992 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ జితేంద్రను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయన జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. రాచకొండ సీపీగా ఉన్న 1995 బ్యాచ్ కు చెందిన మహేశ్ భగవత్‌ను ప్రభుత్వం సీఐడీ అడిషనల్ డీజీపీగా నియమించింది. హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీగా ఉన్న1997 బ్యాచ్‌కు చెందిన దేవంద్ర సింగ్ చౌహాన్‌ను రాచకొండ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పీ అండ్ ఎల్ అడిషనల్ డీజీపీగా సేవలందిస్తున్న 1997 బ్యాచ్‌కు చెందిన సంజయ్ కుమార్ జైన్‌ను లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు ఆయనకు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

## ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డా.వేణు

(మొదటి పేజీ తరువాయి)

వేణుగోపాలాచారి.. 1985 నుంచి వరుసగా 1996 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత రాష్ట్ర మంత్రిగా వ్యవహరించారు. 1996 పార్లమెంటు ఎన్నికల్లో మంత్రిగా ఉంటూనే ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించిన వేణుగోపాలాచారి దేవేగౌడ, ఐకే గుజ్రాల్ మంత్రివర్గంలో సంప్రదాయేతర ఇంధనవనరుల శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1998లో మరోసారి గెలిచి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా సేవలు అందించారు. 1999లో మూడోసారి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచి 2004 వరకు కొనసాగారు. 2004 ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎస్టీగా రిజర్వ్ కావడంతో ఆయన 2009లో కొత్తగా ఏర్పాటైన ముథోల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2012లో టీడీపీకి రాజీనామా చేసి తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో ముథోల్ నుంచి మరోసారి విజయం సాధించారు. 2013లో టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత 2014 ఎన్నిల్లో ఓటమి పాలయ్యారు. ఆ సమయంలో ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారుగా కేసీఆర్ నియమించారు. ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చిన క్రమంలో ప్రభుత్వం వేణుగోపాలాచారిని నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. బిఆర్ఎస్‌తో దేశ రాజకీయాల్లో ముఖ్యంగా వ్యవసాయరంగంపై పోరు సల్పుతున్న సిఎం కెసిఆర్ వేణుకు ప్రాధాన్యం ఉన్న ఐడిసి ఛైర్మన్ పదవిని కట్టబెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.



### కంబోడియా హోటల్‌లో

## ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. బాంటే మీంచే ప్రావిన్స్ పరిధిలోని పోయ్పెట్ పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 10 మంది మృతిచెందగా, 30 మందికి గాయాలయ్యాయి. ఈ హోటల్ థాయ్ లాండ్ సరిహద్దులో ఉంది. దీంతో ఈ ఘటనలో మృతిచెందిన వారంతా కంబోడియా, థాయ్ లాండ్ దేశాలకు చెందినవారే ఉన్నారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. స్థానిక పోలీసులు, మీడియా కథనం ప్రకారం.. హోటల్ లోని మొదటి అంతస్తులో తొలుత మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్న సిబ్బంది, కస్టమర్లు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. ఈక్రమంలో కొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి బయటకు దూకే ప్రయత్నం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్ లో దాదాపు 400 మంది ఉన్నారు.

### యూజీసీ నెట్ పరీక్షకు

## షెడ్యూల్ విడుదల

### ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10 వరకు పరీక్షలు

**న్యూఢిల్లీ,డిసెంబర్29:** యూజీసీ నెట్ పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడేందుకు ఉపయోగపడే ఈ పరీక్షను ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10 వరకు నిర్వహించనున్నట్లు యూజీసీ ఛైర్మన్ మామిడాల జగదీష్ కుమార్ వెల్లడించారు. మొత్తం 83 సబ్జెక్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ బాధ్యతను జాతీయ పరీక్షల మండలికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షకు డిసెంబర్ 29 నుంచి జనవరి 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ పరీక్షలు 2023 జూన్ 1 నుంచి 10 రోజుల పాటు జరుగనున్నాయి. ఈ పరీక్ష తేదీలను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఛైర్మన్ ఎం జగదీష్ కుమార్ గురువారం ప్రకటించారు. దేశంలోని అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ ఎంట్రెన్స్ టెస్ట్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. సెంట్రల్ యూనివర్శిటీల్లో పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కామన్ యూనివర్శిటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కోసం దరఖాస్తు ప్రక్రియ 2023 మార్చి నెల రెండో వారం నుంచి ప్రారంభమవుతుంది. కాగా, ఫలితాలను జూలై 1 న ప్రకటించేందుకు అధికారులు ప్లాన్ చేశారు. సెంట్రల్ కామన్ యూనివర్శిటీ ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహి స్తున్నది. అభ్యర్థులు పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలి. అస్సామీ, బెంగాలీ, ఇంగ్లిష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కోసం దేశవ్యాప్తంగా 1,000 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. 450-500 పరీక్షా కేంద్రాలను నిత్యం వాడేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, తదుపరి సెషన్ నుంచి మరిన్ని ప్రైవేట్, ప్రభుత్వ, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఈ ప్రవేశ పరీక్షలో పాల్గొంటాయని యూజీసీ విశ్వసిస్తున్నది.

### రాహుల్‌కు సెక్యూరిటీలో

## ఎక్కడా లోపం లేదు

(మొదటి పేజీ తరువాయి)

సీఆర్పీఎఫ్ వెల్లడించింది. ఈ విషయాన్ని ఆయనకు ఎప్పటికప్పుడు తెలియజేసినట్లు కూడా సీఆర్పీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. 2020 నుంచి రాహుల్ గాంధీ 113 సార్లు సెక్యూర్టీ ఆంక్షలను ఉల్లంఘించినట్లు కేంద్ర రిజర్వ్ బలగాల శాఖ తెలిపింది. ఢిల్లీలో భారత్ జోడో యాత్ర సాగుతున్న సమయంలో.. రాహుల్ గాంధీయే సెక్యూర్టీ మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు పేర్కొన్నది. మార్గదర్శకాల ప్రకారం సహకరిస్తేనే రాహుల్‌కు రక్షణ ఉంటుందని సీఆర్పీఎఫ్ తెలిపింది. డిసెంబర్ 24వ తేదీన ఢిల్లీలో జరిగిన భారత్ జోడో యాత్రలో సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు కాంగ్రెస్ పార్టీ కేంద్ర హోంశాఖ మంత్రికి లేఖ రాసింది. యాత్రకు వచ్చిన భారీ జనాన్ని పోలీసులు ఆపలేకపోయినట్లు ఆ లేఖలో కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ప్రస్తుతం రాహుల్‌కు జెడ్ ప్లస్ క్యాటగిరీ రక్షణ ఉన్న విషయం తెలిసిందే.

## నేడు యాదాద్రికి రాష్ట్రపతి ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది మురమ్ము శుక్రవారం యాదగిరి గుట్టకు వెళ్లనున్నారు. లక్ష్మీ నర్సింహ్మ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 8.50గంటలకు ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హెలికాప్టర్ ద్వారా యాదగిరి గుట్టకు బయలుదేరనున్నారు. ఉదయం 9.30గంటలకు యాదాద్రి హెలిప్యాడ్ చేరుకోనున్నారు. ఉదయం 9.50 గంటలకు రాష్ట్రపతి ముర్ము శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ఆలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10.30 గంటల వరకు యాదగిరి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఉదయం 10.40 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ తిరిగి రానున్నారు. భారత15వ రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన ద్రౌపదీ ముర్ము యాదాద్రీశుడిని దర్శించుకోనున్నారు. 15 మంది రాష్ట్రపతుల్లో ఇప్పటి వరకు నలుగురు మాత్రమే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాజాగా ద్రౌపదీ ముర్ము స్వామివారిని దర్శించుకున్న ఐదో రాష్ట్రపతిగా నిలువనున్నారు.

### మహిళా సాధికారికతను ప్రోత్సహించే

## సమాజం రావాలి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులను ఛేదించే విషయంలో మనందరి పాత్ర ఉంటుంది. మనమంతా మన వంతు కృషి చేసి, ప్రతి మహిళకు, అమ్మాయికి చరిత్ర సృష్టించే మంచి అవకాశం ఉందని భరోసా ఇద్దాం అని అన్నారు. శ్రీవిద్యా రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలోని వివిధ వర్గాలలో నాయకత్వ స్థానాల్లో ఎక్కువ మంది మహిళలు ఉండేలా మనం కట్టుబడి ఉండాలి. ఉజెవి÷హాలో 18,000 మంది జీఎన్ఐటీయన్లు చాలా పటిష్ఠమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ ను కలిగి ఉన్నారు. వారు ఇప్పుడు పెద్ద కార్పొరేట్లు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ సంస్థలలో అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. వివిధ రంగాల్లో ప్రముఖ నిపుణులుగా ఉన్నారు. ప్రతిభావంతులైన రీసెర్చ్ ఫ్యాకల్టీ సభ్యులు,ప్రోగ్రామ్ డివైస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాల కింద భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంతో చురుకుగా కలసి పని చేస్తున్నారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ని స్థాపించడానికి భారత ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద ఎంపిక చేయబడింది.



### ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు

## తెలుపుతూ జాగ్రత్తలు వహించాలి



**సైదాపూర్ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** మండలంలో నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సైదాపూర్ ఎస్సై జున్ను ఆరోగ్యం గురువారం సైదాపూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండల ప్రజలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించిన చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముందస్తుగా పాత్రికేయులకు మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల

## బిల్లులు చెల్లించాలని ధర్నా

**ఎల్కతుర్తి డిసెంబర్ 29 (ప్రజామంటలు):** మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు, బిల్లులు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ. 3,000 గౌరవ వేతనం అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంఈఓ ఆఫీస్ ఎదుట వంట కార్మికులు ధర్నా




చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు దమ్మల రాంమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గత20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం వంట కార్మికులు విధులు నిర్వహిస్తూ అనేక ఆర్తికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని ఎస్సీ, ఎస్టీ, జనరల్ పేర్లతో కాకుండా అందరికి ఒకే విధంగా బిల్లులు ఇవ్వాలని ఆయన అన్నారు. కార్మికులకు పని భద్రత కల్పిస్తూ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొంకూరి ఐలయ్య, మండలయూ అధ్యక్షురాలు గడ్డం లలిత, మండలం ఉపాధ్యక్షురాలు తోకల రమాదేవి, ప్రధాన కార్యదర్శి సాతూరి వసంత, ఐలమ్మ ,గూడెపు శోభ, దాట్ల ఇందిర పాల్గొన్నారు.

### అయ్యప్ప ఆలయంలో

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు

**దీక్షా పరులకు బిక్ష ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ**

**జగిత్యాల 29 డిసెంబర్ (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని అపరశబరిమలగా వెలిసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో మాజీ మంత్రి,కాంగ్రెస్ సీనియర్ నేత, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు



చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష్మీపతి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గోత్రనామాధులతో అర్చన చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. గురువారం అయ్యప్ప దీక్షాపరులకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి భిక్ష ఏర్పాటు చేయగా దీక్షా పరులను పేరుపేరునా పలుకరిస్తూ అన్నం వడ్డించారు. శబరిమలకు వెళ్తున్న దీక్షా పరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, జగిత్యాల మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కళ్లెపెల్లి దుర్గయ్య, తాటిపర్తి చంద్రకృష్ణా రెడ్డి, అయ్యప్ప గురు స్వాములు నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, స్రామాట్, రమేష్ రావు, సీనియర్ నాయకులు తాటిపర్తి దేవేందర్ రెడ్డి, జగిత్యాల వర్తక సంఘం అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, కచ్చు హరీష్, తాడేపు రమణ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**భీమదేవరపల్లి డిసెంబర్ 29 (ప్రజామంటలు):** మండలంలోని వంగర గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కారోబార్ విజయ్ కుమార్ చిన్న వయసులో



అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని ఆ కుటుంబానికి తీరని లోటు అని మండల జేఏసీ చైర్మన్ అన్నారు. అంబేద్కర్ సంఘంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలక పాత్ర పోషించాడని గుర్తు చేశారు. గురువారం వారి కుటుంబ సభ్యులను దళిత నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రేణిగుంట్ల బిక్షపతి, మాట్ల వెంకటస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### 8 ఏండ్ల బీజేపీ పాలనలో

# మాదిగలకు మిగిలింది మోసమే

**ఎం.ఎస్.ఎఫ్. జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ**

**హన్మకొండ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** ఎస్సీ వర్గీకరణకు ముప్పై ఏండ్లుగా బీజేపీ మద్దతు ప్రకటిస్తూ నేడు వర్గీకరణ సమస్యను పరిష్కరించే సంపూర్ణ అధికారం కలిగి ఉండి కూడా ఏనిమిదెండ్లుగా మాదిగల్ని నమ్మించి, కొండంత నమ్మకం పెట్టుకున్న మాదిగ సమాజానికి నమ్మకద్రోహం తలపెడుతున్న బిజెపి నయవంచకులా తేల్చుకోవాలని, వంద రోజుల్లోనే సమస్య పరిష్కరిస్తామని బిల్లు పెట్టకుండా ద్రోహం చేస్తున్న బిజెపిని రాజకీయంగానే ఎదుర్కొనేలా తాడోపేడో పోరాటానికి జాతి సన్నద్ధం కావాలని దానికి మాదిగ విద్యార్థులే నాయకత్వం వహించాలని ఎం.ఎస్. ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. హన్మకొండ కాకతీయ యూనివర్సిటిలోని వివిధ హాస్టల్ లోని మాదిగ విద్యార్థులతో ఏర్పాటు చేసిన చైతన్య సమావేశాల్లో రాగల్ల ఉపేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..భారత రాజ్యాంగం ప్రకారం సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించడం పాలకుల విధి అని, ఆ కర్తవ్యాన్ని నెరవేర్చని పాలకులు దేశ ద్రోహులుగా మిగిలిపోతారని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు న్యాయం జరగాలని కోరుతున్న ఎస్సీ వర్గీకరణ అంశానికి మించిన సామాజిక న్యాయం దేశంలో మరేదీ లేదని, ప్రభుత్వాలపై ఒక పైసా కూడా భారం పడని అందరూ అనుకూలంగా వున్న న్యాయమైన సమస్యను పరిష్కరించడంలో పాలకులు ద్రోహం చేస్తున్నారని అన్నారు. మాదిగ జాతి 28 ఏండ్లుగా రాజీలేని పోరాటం చేస్తుందని అయితే ఎస్సీ వర్గీకరణ చేయడంలో పాలకులు చేసిన మోసం వల్లనే సమస్య పరిష్కారం జరగడం లేదని అన్నారు. మాదిగ సమాజం ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన ప్రతి పార్టీకి అండగా నిలిచి నమ్మకానికి ప్రతీక నిలబడితే, నమ్మిన మాదిగలను మోసం చేసి పాలకులు మోసానికి ప్రతీకగా మిగిలారని అన్నారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీకి చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి సామాజిక న్యాయాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మాదిగల డిమాండ్ మీద నిర్లక్ష్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం మెడలు వంచేందుకు మాదిగ విద్యార్థులు, యువకులంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ చేస్తారా మోసగాళ్లుగా చరిత్ర ఎక్కుతారో బిజేపి తేల్చుకోవాలని అందులో భాగంగా పోరాటాన్ని ఉధృతం చేయడం కోసం జనవరి 04 ఛలో పాలమూరు యూనివర్సిటీ యూనివర్శిటీల మాదిగ విద్యార్థుల



జాతీయ మహాసభను నిర్వహిస్తున్నామని, ఈమహాసభకు యూనివర్సిటీల మాదిగ విద్యార్థులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటం ఉధృతం కాకంటే ముందే ఇచ్చిన మాటకు కట్టుబడాలని, నిర్లక్ష్యం వహిస్తూ జాతి భవిష్యత్తుపై దెబ్బకొట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని, అధికార కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధాన శత్రువుగా చేసుకొని యుద్ధాన్ని తీవ్రతరం చేస్తామని, కేంద్రం మోసం చేస్తుంటే స్పందించని ప్రతిపక్షాలు, రాజకీయ పక్షాలు, పార్లమెంటులో మాట్లాడని ప్రజాప్రతినిధులపై కూడా దండోరా మోగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎఫ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు మంద భాస్కర్ మాదిగ, యూనివర్సిటీ నాయకులు డాక్టర్ వడ్డేపల్లి మధు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పల్లి అనిల్ మాదిగ, వివిధ హాస్టల్ల ఎం.ఎస్.ఎఫ్. బాధ్యులు సామర్ల అరవింద్ మాదిగ, పర్లపెల్లి నిశాంత్ మాదిగ, రాఘవేంద్ర మాదిగ, శంకర్, రఘువరన్ మరియు న్యూ పీజీ, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ హాస్టల్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ వ్యవస్థ రద్దు చేసి

## భారత రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థను రక్షించాలి

**మాజీ ఎమ్మెల్యే సి.హెచ్. రాజారెడ్డి**

**జనగామ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను అక్రమంగ కూల్చుతూ, మరోవైపు గవర్నర్ కార్యాలయాలను బీజేపీ ఆర్ఎస్ఎస్ క్యాంపుగా మార్చి ప్రతిపక్ష ప్రభుత్వాలను గవర్నర్ ద్వారా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇది ఫెడరల్ వ్యవస్థకు పూర్తి విరుద్ధమని, గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు సి. హెచ్. రాజారెడ్డి అన్నారు. సీపీఐ రాష్ట్ర పార్టీ గవర్నర్ వ్యవస్థ రద్దు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేసిన ధర్నా నుద్దేశించి రాజారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం మోడీ ప్రభుత్వం క్రూరంగా ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాల ఎమ్మెల్యేలను కొనడంతో ఇప్పటికి 9 ప్రభుత్వాలను కూల్చి నీచ రాజకీయానికి మోడి తెర లేపారని, కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ వంటి ప్రభుత్వాలను కూల్చడానికి ఘోరమైన తప్పిదాలు చేస్తూనే గవర్నర్ ఆఫిసులు బీజేపీ, ఆర్.ఎస్. ఎస్, క్యాంపుగా మార్చి,గవర్నర్ చేత చాలా ఇబ్బంధులకు గురి చేస్తున్నారని ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఫెడరల్ వ్యవస్థకు ఆటంకమని, ఈ వ్యవస్థనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు పేదలను ప్రభుత్వాలు పట్టించుకోకుండా, కనీస సౌకర్యాలు కల్పించడంలేదని, నెల్లుట్ల భూస్వామి లక్ష్మణ్ సింగ్ మిగులు భూమిని స్వాధీనం చేసుకోకోసి, అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఈ నినాదంతో భూపోరాటం చేస్తున్నామని అన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రమ్స్, కొత్తవారికి రేషన్ కార్డ్స్, పెన్షన్స్,



అందరికి దళిత బంధు, ఇవ్వాలని డిమాండుతో జిల్లా కలెక్టర్ వినతిపత్రం కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, సొప్పరి సోమయ్య,మంగళంపల్లి జనార్దన్, చింతకింది అరుణ, మోతే శ్రీశైలం, చామకూర యాకుబ్, గుడెల్లి రాజు, పాతురి ప్రశాంత్, జువారి రమేష్, రావుల సాధానందం, కూరపాటి విజయకుమార్, చల్లోజు మల్లేశం, జీడీ ఎల్లయ్య,తోట రమేష్, బోనగిరి కుమార్, మాలోతు విజయ, గుగులోత్ సఖి, కొంపెల్లి విజయ, తిప్పారపు తులసి, జీ. విజయ, లచమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధుల మళ్లింపు దారుణం

**వైఎస్సార్ టిపి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ**

**జగిత్యాల 29 డిసెంబర్ (ప్రజామంటలు):** పంచాయతీలకు వచ్చిన కేంద్ర నిధులను ప్రభుత్వం మళ్లించడం దారుణమని, ఈ చర్యలకు పాల్పడిన ఉద్యోగులపై కేసులు నమోదు చేయాలని వైఎస్సార్ టిపి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చెదల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ టిపి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధ్యక్షులు సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెదల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రం నుంచి గ్రామపంచాయతీ లకు వచ్చిన నిధులను మళ్లించడం చీటర్లు చేసేపని అని ప్రభుత్వాలు చేసే పని కాదన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నిధులను మళ్లింపు పనికి పూనుకొన్న అధికారులపై సైబర్ నేరాల క్రింద కేసు నమోదు చేయాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్న సర్పంచులు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. గ్రామ పంచాయతీల స్వయం పరిపుష్టి కి కేంద్రం నేరుగా పంచాయతిలకే నిధులను ఇస్తోందని అన్నారు. ప్రభుత్వానికి నిధుల సేకరణ చేతకాకపోతే రాజీనామా చేయాలని



సత్యనారాయణ సూచించారు. సర్పంచులకు వైఎస్సార్ టిపి అండగా ఉంటుందని చెదల సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఇంచార్జ్ కాముని గంగాధర్, ధర్మపురి ఇంచార్జ్ రాజమ్మ, ప్రేమ్ సాగర్, వినయ్ రెడ్డి తోపాటు పట్టణ, మండల అధ్యక్షులు ఉన్నారు.

## ఎల్కతుర్తి నుండి ఖమ్మంకు బయలుదేరిన సీపీఎం నాయకులు

**ఎల్కతుర్తి డిసెంబర్ 29 (ప్రజామంటలు):** ఖమ్మంలో జరిగే తెలంగాణ రాష్ట్ర మూడవ, మహాసభలకు వెళుతున్న, సిపిఎం కార్యకర్తలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు జెండా ఊపి ప్రారంభించారు. అంబాల స్వరూప, లోకిని స్వరూప, మరియు కమిటీ సభ్యులు, దుంపేటి అరుణ, అంబాల మమత, గొల్లరాధ, మేకల కోమల, మాటూరి ప్రభులత, ముద్ర కోళ్ల, యాదగిరి, వీణవంక రమేష్ చారి, ముద్ర కోళ్ల వెంకటేష్, వేలు స్వామి, షణ్ముఖం, అన్న రాజ్ కుమార్, మరియు గుడిసె వాసులు పాల్గొన్నారు.





సదరం క్యాంప్ జనగామ జిల్లా ఆస్పత్రిలో మానసిక వికలాంగుల క్యాంపు నిర్వహణ. పాల్గొన్న డాక్టర్ మురళీకృష్ణ బృందం, డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు, ఈ క్యాంపుకు 40 మంది అటెండ్ అయ్యారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని అసదుద్దీన్ ఒవైసీకి వినతి

**జనగామ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, పార్లమెంట్ లో బిల్లు పెట్టుటకు యంఐయం పార్టీ మద్దతు ఇవ్వాలని పార్లమెంట్ లో



మాట్లాడాలని అసదుద్దీన్ ఒవైసీ ని కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ.... కరెన్సీ నోట్లపై అంబెద్కర్ ఫొటో ముద్రించాలని, నూతన పార్లమెంట్ కు అంబెద్కర్ పేరు పెట్టాలని పల్లె నుండి ఢిల్లీ వరకు ప్రజా పోరు రథయాత్ర జనవరి 26నుండి ఏప్రిల్ 14 విశాఖపట్నం నుండి ఢిల్లీ వరకు జరుగు యాత్ర కు అసదుద్దీన్ ఒవైసీ రావాలని కోరారు. అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, అంబేద్కర్ లేకుంటే ఈ రాజ్యమే లేదని, అంబేద్కర్ ఆలోచన విధానమే మా విధానం అని పార్లమెంట్ లో మాట్లాడానని, ఈ డిమాండ్ సాధన కు కట్టుబడి ఉన్నామని పార్లమెంట్ లో మాటడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ సలహా దారులు ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బెదరకోట లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం

**రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అల్పాహారం**

**జనగామ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** బెదరకోట లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం కుమారుడు రాము కోడలు సౌమ్య రాజరాజేశ్వరి



వృద్ధాశ్రమంలో అల్పాహార కార్యక్రమం నిర్వహించి వృద్ధులకు ఒక పూట ఆకలి తీర్చి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి సల్ల మహేష్ మాట్లాడుతూ.... ప్రజలు సందర్భం ఏదైనా కానీ పుట్టినరోజు పెళ్లిరోజు వేడుకల సందర్భంగా ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చి జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందుండి నడిపిస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి సల్ల మహేష్ ను జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనగామ అమ్మ ఫౌండేషన్ టీం ఆశిష్. పులిళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరభద్రుడి హుండీ లెక్కింపు

**భీమదేవరపల్లి డిసెంబర్ 29 (ప్రజామంటలు):** కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి వారి హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు గూడూరి సంజీవరెడ్డి, ఈవో కిషన్ రావు, ఆలయ అర్చకుల సమక్షంలో ఉండిని లెక్కించగా రూ.



4,81,530 ఆదాయం వచ్చిందన్నారు. అనంతరం వీరభద్రస్వామి ఆలయ క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఏల్తూరి ప్రభాకర్, మాటము శ్రీశైలం, నాగపురి సతీష్, నాగరబోయిన రవి, కొత్తకొండ ఎంపీటీసీ యాటపూలు రాజమణి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది నాగేశ్వరరావు, శోభన్ బాబు, యూనియన్ బ్యాంకు సిబ్బంది రాజేష్, సత్యనారాయణ, దేవాలయ అర్చకులు రాజయ్య, ఉప ప్రధాన అర్చకులు రాంబాబు, అర్చకులు, సరస్వతి సేవా సమితి కొత్తకొండ సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలను వదిలి స్వారీ!

ప్రశ్నించే గొంతులను వినిపించుకోకపోతే... ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకమవుతుందని పాలకవర్గాలు గ్రహించలేక పోతున్నాయి. ఈ యేడది పరిస్థితులు,పాలకు తీరును గమనిస్తే ఇది స్పష్టంగా గమనించవచ్చు. కేంద్రంలోని బిజెపి కావచ్చు ...లేదా ఉభయతెలుగు రాష్ట్రాల్లోని పాలకులు కావచ్చు..దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీల పాలకులు కావచ్చు..పాలకులుగా ప్రజల ఆందోళనలు అర్థంచేసుకోలేక పోతున్నాయి. కరోనా తీవ్రత కారణంగా దేశానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. స్థూల దేశీయోత్పత్తి జిడిపి బాగా క్షీణించింది. కరోనాను సాకుగా చూపి దేశంలోని కార్పొరేట్లు... వ్యాపారులు, భూస్వాములు, బడా విదేశీ పెట్టుబడి దారులు బలపడ్డారు. అంతిమంగా సామాన్యులు బాగా బలహీనపడ్డారు. వీటిన ఇచక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు. పాలకు ఈ సమస్యలు తమ ఎజెండాలో లేవన్న స్థిరాభిప్రాయంలో ఉన్నారు. ఇకపోతే మోడీని వ్యతిరేకించే శక్తులు ఏకం కావడం ఇప్పట్లో సాధ్యంయ కాకపోవచ్చు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర తక్షణ రాజకీయ ప్రయోజనాలు ఇవ్వలేకపోవచ్చు. కాని ఒక రకంగా ప్రత్యామ్నాయ ఆలోచనా విధానంపై చర్చకు అవకావం ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ఎక్కడో ఒకచోట ప్రశ్నించేతత్వం రావాలి. కేంద్రంలోని బిజెపిని ఢీకొనేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ శక్తులు సమాయత్తమవుతు న్నాయి. అయితే పాలనలో ఉన్న వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలు తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ.. కేవలం మోడీవైపు వేలెత్తి చూపుతున్నాయి. దీనిని కూడా ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. నిజానికి ప్రభుత్వాలపైనే ప్రజలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.. బిహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని వదిలించుకుని మహాకూటమి సర్కార్ ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి కూడా పెద్దగా ఆశాజనకంగా లేదు. ఢిల్లీలో బిజెపి ఉధృతిని అడ్డుకుని పంజాబ్,ఢిల్లీల్లో పాగా వేసిన అరవింద్ కేజ్రీవాల్ మరోవైపు సవాల్ చేస్తున్నారు. తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ కూడా బిజెపిపై సవాళ్లు విసరుతు న్నారు. రాజకీయంగా చూస్తే, గడచిపోతున్న సంవత్సరం అంతా మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి పెద్ద విజయాలనే అందించింది. అయితే చివరలో హిమాచల్, ఢిల్లీ ఎన్నికల్లో దెబ్బతీసింది. ఇది ఓ హెచ్చరికగా ఆయన తీసుకుంటే మంచింది. ఆయా రాష్ట్రాల్లో సాధించిన విజయాలే 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపి తిరిగి జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించుకుంటుందన్న ధీమాలో బిజెపి నేతలు ఉన్నారు. అందుకే బిజెపి తన పూర్తి దృష్టిని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. 2023లో కూడా పది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్, కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో అధికారం నిలబెట్టుకోవడంతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నుంచి, తెలంగాణలో బిఆర్ఎస్ నుంచి అధికారాన్ని కైవశం చేసుకునేందుకు బిజెపి ఉవ్విళ్లూరుతోంది. గత 8 సంవత్సరాలుగా ప్రతిపక్షాలు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపితో హోరాహోరీగా పోరాడుతున్నాయి. అయినా పెద్దగా విజయం సాధించడం లేదు. 2024 నాటికి కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో తలపడేందుకు సన్నద్ధం కాగలుగుతుందని తహతహలాడుతోంది. రాహుల్ జోడోయాత్రతో అంతా సానుకూలం అయ్యిందన్న భరోసాలో ఉంది. ఈ 8 సంవత్సరాల్లో కాంగ్రెస్ పది రాష్ట్రాల్లో అధికారం కోల్పోయింది. కేవలం రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌లోనే అధికారంలో ఉన్నది. పార్టీ జాతీయ అధ్యక్షుడుగా మల్లికార్జున ఖర్గే ఎన్నిక కావడంతో ఒక రకంగా నాయకత్వ సమస్యపై చర్చ లేకుండా చేసింది. మరో వైపు ఎలాంటి పదవి లేకపోయినప్పటికీ రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్రతో పార్టీకి అసలైన నేత తానే అని చెప్పకనేచెబుతున్నారు. దేశంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలు, ఎన్జీవోలు ఈ యాత్రలో పాల్గొనడంతో పాటు మద్దతుతెలపడంతో నిజంగానే రాహుల్‌లో ఉత్సాహంరెట్టించింది. గత ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి ఎందుకో సామాన్యులను నేటికీ దరిచేర్చుకోవడం లేదు. ప్రధాన సమస్యలపై స్పందించడం లేదు. ఆర్థిక సమస్యలను,ధరల పెరుగుదలను పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు దూకుడుగా ఉన్న మమతా బెనర్జీ ఇటీవలి ఆ రాష్ట్రపరిణమాల నేపథ్యంలో మౌనం పాటిస్తున్నారు. నితీశ్ కుమార్, కేసీఆర్, శరద్ పవార్, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేశ్ యాదవ్ తదితరులకు బిజెపిని ఢీకొనడం మినహా వేరే మార్గం లేదు. బిహార్, మహారాష్ట్రలో బిజెపిని ఢీకొనాలంటే సైద్ధాంతిక విభేదాలను పక్కన పెట్టే కూటమి లేకుండా సాధ్యపడదని ప్రతిపక్షాలు గ్రహించడం లేదు. కేసిఆర్ భారత రాష్ట్ర సమితి శంఖారావం అయితే పూరించారు గానీ దానికి రథాన్ని సిద్ధం చేయలేదు. 2024 ఎన్నికలకు జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక పక్షాలు ఏ రూపంలో వస్తాయన్నదానికి స్పష్టత లేదు. సిబిఐ,ఈడీలతో పాటు అనేక వ్యవస్థల్నీ బిజెపి పెద్ద ఎత్తున ఉపయోగించుకుని ప్రత్యర్థుల్ని నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. తెలంగాణకు సంబంధించి ఢిల్లీ మద్యం కుంభకోణం, ఎమ్మెల్యేల కొనుగోలుపై సిబిఐ, ఈడీల పంజా మరింత విస్తృతం కావడంతో ఈ కేసులు ఎటు తిరుగుతాయో చెప్పలేం. బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులపై పాత అవినీతి కేసులు మళ్లీ తెరిచారు. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఇతర నేతలపైనే 95 శాతం పైగా సిబిఐ కేసులున్నాయి. ఇకపోతే ఏడాది చివరలో మరోమారు కరోనాకొత్త వేరియంట్ భయపెడుతోంది. అన్ని దేశాలతో పాటు భారత్ కూడా కరోనా తీవ్ర ప్రభావానికి గురయ్యింది. ఇప్పటికీ దీనిపీడ విరగడ అయ్యిందన్న ధీమా రావడంలేదు. ఏడాదిలో సుమారు సగం రోజులు భయాలతోనే గడిచిపోయాయి. ఈ కారణంగా 2022 సంవత్సం ప్రజలకు తీరని వేదన మిగిల్చింది. ఓ రకంగా వరుసగా మూడేళ్లు ప్రజలకు తీరని నష్టాన్ని కలిగించింది. ఇదోపక్క ఇలా ఉండగానే అనేక ఆందోళనలు కూడా దేశాన్ని అతలాకుతలం చేశాయి. వీటిని అధిగమించేలా పాలకుల తీరులో మార్పు వస్తే తప్ప ప్రజలకు ఉపశమనం కలగదు.



---




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, "నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...


-ఎడిటర్

## చెట్టు వేసిన శిక్ష!!

శిష్యునికి వచ్చిన సందేహం .

సదానందుడు కాశీ కి వెళుతూ కొంతమంది శిష్యులతో కలసి ప్రయాణంచేస్తూ దారిలో వచ్చే గ్రామాలలో ప్రజలకు సందేశం వినిపిస్తూ, వారు ఇచ్చేఆహారపదార్థాలు స్వీకరిస్తూ, అలా ఒకగ్రామం చేరారు. ఆ గ్రామ ప్రజలు సదానందునికి ఘనస్వాగతం చెప్పి, గోప్ప విందుఏర్పాటు చేసి, సదానందుని ప్రసంగం వినడానికి ప్రజలందరు తరలివచ్చారు. సదానందుడు తన సందేశంలో, ' సహాయం పొందినవారికి సహాయం చేయడం గొప్పవిషయంకాదు. అపకారికి కూడా ఉపకారం చేయడమే క్షమాగుణం.ఇది చాలా గొప్ప ఉత్తమమైన సుగుణం.

నాయనలారా! మనసును జయించడాన్ని'దమ' అంటారు. చతుర్విధ



దానాలు అంటే మరణ భయంతోఉన్నవానికి అభయం యివ్వడం, వ్యాధిగ్రస్తునకు సరియైన చికిత్స చేయించడం, విద్యాదానం, అన్నదానం. ప్రత్యుపకారం ఆశించకుండా చేసేదానాన్ని 'సాత్విక 'దానం అని, తిరిగి ఉపకారాన్ని ఆశించి చేసే దానాన్ని 'రాజస' దానం అంటారని వివరించారు. తృణీకారభావంతొ చేసేదానాన్ని 'తామస' దానం అని,. దానంచేసేవారిని మూడు రకాలుగా విభజించవచ్చు.

తనకు ఉన్నదంతా దానంయిచ్చేవాడు 'దాత'. తనవద్ద ఉన్నదంతా యిచ్చి యింకా యివ్వలేక పోయానే అనిబాధపడేవారిని 'ఉదారుడు', తన వద్ద లేకున్నాయితరులను అడిగి తెచ్చి, యిచ్చేవాడిని 'వదాన్యుడు' అంటారు. ఇది దాతల వివరం. శిబిచక్రవర్తి. బలిచక్రవర్తి. కర్ణుడు వంటి మహనీయులు మనచరిత్రలో దాన మహిమ గొప్పగా మనకు తెలియజేసారంటూ, దానశీలతను గురించి వివరించారు.

మీ గ్రామ ప్రజలు, దేశం అంతటా విద్య, వ్యాపార,వివాహాది విషయాలలో సంభంధాలు పెంపొందించుకొండి. మీ గ్రామ ప్రజలు అందరికి నా శుభా ఆశీస్సులు'అని తన ప్రసంగం ముగించాడు సదానంద స్వామి. ఆరాత్రి అక్కడే బసచేసి, మరుదినం మరో గ్రామానికి తనశిష్యులతో కలసి వెళ్లాడు. ఆగ్రామంలో సదానందునికి ఎటువంటి స్వాగతం, ఆహార పదార్థాలు లభించలేదు. తమవద్ద ఉన్న సామాగ్రితో వంట ప్రయత్నాలను, కొందరు శిష్యులు చేస్తున్నారు. మరికొందరు శిష్యులు అక్కడ ఉన్నమర్రి చెట్టుకింద ఉన్న ప్రదేశాన్ని నీళ్లు చల్లి ఊడ్చిశుభ్రపరిచారు. సాయంత్రం సదానందుని ప్రసంగం వినడానికి చాలామంది జనం ఎటువంటి పండు, ఫలహారాలు తీసుకురాకుండా వచ్చారు. ఆగ్రామంలో సదానందుడు ప్రసంగిస్తూ 'భక్తులారా మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అన్నారు పెద్దలు. తిథి చూడకుండా వచ్చేవాడే అతిథి అని, అతిథి దైవ సమానుడని శాస్త్రాలు చెపుతున్నాయి. అతిథిని యధాశక్తిన ఆదరించాలి. అదిమన భారతీయ సంస్కృతిలో భాగం. అతిథిని గౌరవించనివారికి నరక ప్రాప్తికలుగుతుంది. మీరంతా గ్రామం విడిచి దూరప్రాంతాలలో స్థిరపడకండి. వివాహాది శుభకార్యాలకు ఈ గ్రామంలోనే చేసుకుంటూ ఇక్కడే ఉండండి. ఈరోజుకు స్వస్తి 'అని తనప్రసంగం ముగించాడు సదానందస్వామి.

రాత్రికి విశ్రమిస్తూన్న సమయంలో ఒశిష్యుడు 'స్వామి ఆగ్రామ ప్రజలను దేశం నలుమూలలకు వెళ్ళి స్థిరపడమని, ఈగ్రామ ప్రజలను ఇక్కడే ఉండమని ఆశీర్వదించారు,ఎందుకు అలా' అన్నాడు.' నాయనా ఆ గ్రామప్రజలు దయా, పాపభీతి, ఆకలివిలువ తెలిసిన సద్గుణ సంపన్నులు. వారి గుణగణాలు, మంచి బుద్ధి లోకం అంతా తెలుసుకుని నేర్చుకునేలా దేశ వ్యాప్తంగా వారందరిని వెళ్ళి స్థిరపడమన్నాను. ఈ గ్రామప్రజలు సంస్కారహీనులు. దానగుణహీనులు, ఎదటివారి ఆకలి గురించి అవసరాలు గమనించనివారు. వీరి అవలక్షణాలు దేశంఅంతా నేర్పకుండా ఇక్కడే వారిని ఉండమన్నాను. ఆగ్రామం వారి ప్రవర్తన, ఈ గ్రామంవారి ప్రవర్తన నీవు స్వయంగా చూసావుగా, మనిషికి ఒడ్డు,పొడవు, రంగు,రూపు కాదుముఖ్యం, బంగారాన్ని రుద్ది చూస్తాము, మనిషి ప్రవర్తన పైనే వారి అర్హత నిర్ణయిం పబడుతుంది, అన్నాడు సదానందుడు.

అర్థం అయింది అన్నట్లు తలఉపాడు శిష్యుడు.


-డా.బెల్లంకొండనాగేశ్వరరావు. చెన్నయ్.
98844 29899

---

# సిద్ధిపొందిన తాపసి రమణ మహర్షి

## డిసెంబర్ 30... భగవాన్ శ్రీరమణుల జయంతి

ఆది 1879వ సంవత్సరం డిసెంబర్ 29వ తేదీ. దక్షిణ భారతావనిలోని తమిళనాట తిరుచ్చుళీ క్షేత్రం. శివుని పంచమూర్తులలో నటరాజ ఆనందమూర్తి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని, జరుపుకున్న ఆరుద్ర దర్శనం' అనే ఉత్సవ సందర్భం. శ్రీభూమినాథేశ్వర ఆలయ సంబంధ ఆలంకృత ఉత్సవ మూర్తులను రథంపై వీధుల గుండా ఊరేగించిన ఉత్సవ సమయం. కొనసాగుతున్న ఉత్సవ క్రమంలో అర్థరాత్రి దాటాక డిసెంబర్ 30నాటి తొలి గంటలో కోవెలను ఆనుకుని ఉన్న ఇంటిలో



ఒక మగ శిశువు జన్మించాడు. సుందరం అయ్యర్, ఆళగమ్మ దంపతులకు కలిగిన ఆ బాలునికి.. "వేంకటేశ్వరన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే తర్వాతి కాలాన "భగవాన్ రమణ మహర్షి" అని ఖ్యాతి గడించాడు. బాలుని బాల్యం సాధారణంగా సాగింది. తండ్రి మందలింపు తో ఒకమారు పక్క గుడిలో జగన్మాత విగ్రహం వెనుక దాగి ఉన్నాడు. తెలియని వయసులో ప్రాపంచిక సంకటాల నుండి ఉపశమన లక్ష్యంతో దైవసన్నిధిని ఆశ్రయించడం భవిష్యత్ జీవితానికి సంకేతం. అద్భుత జ్ఞాపక శక్తి కారణంగా పాఠశాలలో విన్నవన్ని వెంటనే అప్పచెప్పేవాడు. యువకునిగా పెరియ పురాణం (శివభక్త విలాసం) గ్రంథాన్ని పఠించారు. శివునికి ధన ప్రాణమానాలను సమర్పించిన 63 నాయనార్ల గాథల పట్ల దివ్యావేశానికి లోనై, త్యాగభరితమై సాయుజ్యానికి దారితీసే గాథలకు పరవశుడై, సాధుమార్గ అన్వేశి అయినారు.

నాటి నుండి ఆయనలో దివ్య ప్రేరణ కలిగింది. రామస్వామి అనే వ్యక్తిని ఎక్కడనుండి వస్తున్నారని ప్రశ్నించి ," ఆరుణా చలం" , నుండి అని సమాధానం పొందగా, ఆయన ఎదో తెలియని అనుభూతికి లోనైనారు. నాటి నుండి ప్రాపంచిక విషయాల పట్ల విముఖులు కావడం ప్రారంభమైంది. 1896 ఆగస్టు 29న చదువుల పట్ల నిరాసక్తత కలిగి, ఇల్లు వదిలి స్కూల్ ఫీజు కు 5రూపాయలు అన్న వద్ద తీసుకుని, ఉదాత్తమైన ఆశయ సాధనకోసం వెళుతున్నానని 3 రూపాయలు మాత్రమే వెంట ఉంచుకుని, లేఖ వదిలి వెళ్ళి, దైవ మార్గ నిర్దేశత్వంతో, కష్ట నష్టాలకులకు ఓర్చి, సుదీర్ఘ ప్రయాణానంతరం సెప్టెంబర్ 1న ఆరుణోదయ వేళలో... ఆరుణాచలంలో మంగళ ప్రద మంగళవారం మంచి ఘడియలో పాదం మోపి, ప్రాకార ద్వారాలు, గర్భాలయం సహా బార్ల తెరిచి ఉన్న శ్రీఆరుణాచలేశ్వర ఆలయ ప్రవేశం చేశారు. మహాలింగాలింగనం ద్వారా ఆత్మ సమర్పణం చేసుకున్నారు. నాటి అరుణాచల ఆగమనం నుండి నేటి రమణాశ్రమంగా రూపు దిద్దుకున్న గిరి దక్షిణ పాదంలో స్థిరపడి, 1950 , ఏప్రిల్ 14 మహా నిర్యాణం వరకు 54 ఏళ్ళు, బ్రాహ్మణ స్వామిగా చిరపరిచితులై, తమకు ప్రియమైన అరుణగిరి పొలిమేర దాటనే లేదు. స్వామి ఉనికిని గురించి తెలుసుకున్న తల్లి అళగమ్మ, ఇంటికి వెళదామని అర్థించగా... "కర్త వారివారి ప్రారబ్ధానుసారం జీవులనాడించును. జరుగనిది ఎంత ప్రయత్నించినను జరుగదు. జరుగునది ఎవరెంత యడ్డు కున్నను జరుగనే జరుగును. ఇది సత్యము. కనుక మౌనముగ ఉండుటయే ఉత్తమము"... అని కాగితంపై రాయగా, ఆమె ఖిన్నవదనయై వెనుతిరుగారు.

రమణులు గిరిపై విరూపాక్ష గుహలోనే 17 ఏళ్ళ వాసాన్ని గడిపారు. 1916లో రమణులు విరూపాక్ష నుండి స్కందాశ్రమానికి మారారు. తల్లి అక్కడున్న అందరికీ వండి పెట్టగా , ఆమెకు అనుక్షణం వైరాగ్యాన్ని బోధించారు. 1920లో తల్లి ఆరోగ్యం క్షీణించగా , ఆమను కంటికి రెప్పలా కాపాడుతూ, 22లో రమణుల హస్త మస్తక సంయోగ దీక్ష ద్వారా అళగమ్మకు దేహ విముక్తి కలిగించారు . ఆమెకు స్పృహ ఉన్నంత వరకు వేదాంత బోధ చేస్తూ, చివరగా తమ కుడి చేతిని ఆమె హృదయం పైన, ఎడమ చేతిని శిరస్సుపైన ఉంచి, తదేక దృష్టితో వీక్షిస్తూ, మోక్షాన్ని ప్రసాదించారు. ఆమె పార్థివ శరీరాన్ని దహనం చేయకుండా, గిరి దక్షిణ పాదంలో సమాధి చేశారు . ఆ సమాధి చుట్టూ నిర్మాణాల సమాహారమే నేటి శ్రీరమణాశ్రమం. 1949లో మహర్షుల ఎడమ మోచేతిపై సార్కమా (క్యాన్సర్) రాగా 1950, ఏప్రిల్ 14న స్వామి అంతిమ ఘడియలు సమీపించాయని గ్రహించిన భకులు "ఆరు ణాచల శివ" అంటూ రమణ మహర్షి విరచితాలను నిన దించగా, రా త్రి 8 .47 గంటల సమయాన దక్షిణా కాశంలో ఒకపెద్ద కాంతి గోళం మెరసి, ఈశాన్యం వైపు పయనించి, ఆరుణాచల శిఖరా న అంతర్థానమైంది. రమణుల ఆధ్యాత్మిక శక్తి వికాసం ఆయన దేహయాత్ర అనంతరం నానాటికీ మహోజ్వలంగా బాసిస్తునే ఉన్నది .



-ఆర్కె సంగనభట్ల
9440595494

---

# ఖమ్మం రాజకీయాల్లో పాతుకుపోతున్న పువ్వాడ

**తుమ్మల సైలెంట్ కావడంతో ఆయనదే పైచేయి**

**క్యాడర్ అండతో ఎదిగిన అజయ్**

**డీలా పడ్డ కాంగ్రెస్...బలం చాటేందుకు బిజెపి యత్నాలు**

**ప్రజా పోరాటాల్లో వెనక్కి తగ్గేది లేదంటున్న సిపిఐ**

**ఖమ్మం,డిసెంబర్29:** ఖమ్మం రాజకీయాల్లో ఇప్పుడు అంతా మంత్రి పువ్వాడ హవానే నడుస్తోంది. మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర రావు సైలెంట్ అయ్యారు. ఈ మధ్య అడపాదడపా ఆయన తెరపైకి వచ్చి మాట్లాడుతున్నా బిఆర్ఎస్‌లో ఆయనకు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది. పార్లమెంటరీ పార్టీనేత నామా నాగేశ్వర రావు కూడా ఢిల్లీకే పరిమితం అయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో అన్నింటా టిఆర్ఎస్ విజయంతో పువ్వాడ బలం పెంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా పువ్వాడ అజయ్‌కుమార్ ఒక్కరే గెలుపొందినప్పటికీ.. ఆ తర్వాత నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వైరా స్వతంత్ర ఎమ్మెల్యే, సత్తుపల్లి టీడీపీ ఎమ్మెల్యే టీఆర్ఎస్ లో చేరడంతో జిల్లాలో టీఆర్ఎస్ బలం ఏడుకు చేరింది. దీంతో ఇక అన్ని ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులు లేరన్న ధోరణిలో పట్టు సాధించారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ ప్రభావం చూపక పోయినప్పటికీ.. బలపడేందుకు ప్రయత్నాలు వేగిరం చేసింది. ఇటీవలి మునుగోడు ఫలితాలతో లెఫ్ట్పార్టీలో ఆశలు ఊందుకున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నియామకం తరవాత జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు యత్నాలు సాగుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ప్రయత్నించినా ఆశించిన రీతిలో ఆ పార్టీ బలం పుంజుకోలేక పోయింది. దీంతో వచ్చే ఉన్నికల్లో అయినా సత్తా చాటాలని చూస్తున్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అపజయాలు ఆ పార్టీని కొంత కుంగదీశాయి. టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలు మరోసారి కొనసాగడంతో పార్టీ మరింత దెబ్బతిన్నది. కమ్యూనిస్టులు పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేపట్టినా.. అనుకున్న విధంగా రాణించలేక పోయాయి. బీజేపీ భవిష్యత్‌పై ఆశలు పెంచుకుంటూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీ ఎన్నికల నుంచి మండల, జిల్లాపరిషత్, లోక్‌సభ ఎన్నికల వరకు టీఆర్ఎస్ వరుస విజయాలు సాధించింది. దీంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు సునాయాస మేనని ధీమాలో ఉన్నారు. రెండుజిల్లాల్లోనూ మెజారిటీ ఎంపీపీలను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఆరు సీట్లను దక్కించుకున్నప్పటికీ.. అందులో నలుగురు ఎమ్మెల్యేలు గులాబీ గూటికి చేరారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ, పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ డీలా పడింది. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్కకు శాసనసభా ప్రతిపక్ష హోదా దక్కినప్పటికీ.. కొన్నిరోజులకే చేజారిపోయింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి ఒకరి తర్వాత ఒకరుగా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. మొత్తంగా కాంగ్రెస్ డీలాపడ్డా తమ సత్తా కూడా చాటుతామని అంటున్నారు. వామపక్షాల విషయానికి వస్తే.. సీపీఎం, సీపీఐ, ఎన్డీ ప్రజాపోరాటాల్లో ముందున్నా.. ఎన్నికల్లో వెనుకబడ్డాయి. అయితే మారిన రాజకీయ సమీకరణాల్లో బిజెపి ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. అయితే ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు మొదలు అనేక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. తమకు అసెంబ్లీలో బలం లేకున్నా ప్రజల్లో మాత్రం విశ్వాసం చెక్కు చెదరలేదన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం ఆందోళనలు, ఉద్యమ కార్యచరణ ఒక్క కమ్యూనిస్టు పార్టీకే సొంతమన్నారు. పోరాట పంథాతోనే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎలుగెత్తి చాటడంతో పాటు పేదల పక్షాన నిలుస్తూ ప్రజాసమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టు పార్టీ ముందు నిలుస్తుందన్నారు. అధికారం, పదవుల ఆకాంక్షతో తెలంగాణ ఆకాంక్షలు మరుగున పడ్డాయన్నారు. ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో సెక్యులరిజం కాపాడడంతోపాటు మతోన్మాదులను నివారించడంలో కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులు హరిస్తోందని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాలతో మార్కెటింగ్ వ్యవస్థను పెట్టుబడిదారుల చేతుల్లోకి తీసుకెళ్లిందన్నారు. రైతుల పక్షాన సీపీఐ పోరాటంలో ముందుందన్నారు. పాలక ప్రభుత్వాల దోపిడీ విధానాల వల్ల దోపిడిదారులు కోట్లకు పడగలెత్తుతు న్నారన్నారు. ప్రజాసంపద దోచుకుంటున్నారని విమర్శించారు.



---

# అధికారపార్టీలకు వ్యతిరేకంగా బలమైన పోరు

తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలకు వ్యతిరేకత బాగా బలపడిందనే చెప్పాలి. పార్టీలన్నీ మరోమారు నిలదొక్కునే యత్నాలు మొదలు పెట్టాయి. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపిలు అధికార టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలకు పునాది వేశాయి. ధాన్యం సేకరణ, నిరుద్యోగం తదితర అంశాలతో పోరాడుతున్నాయి. ధాన్యం సేకరణలో టిఆర్ఎస్ కూడా కేంద్రంలోని బిజెపిని లక్ష్యంగా చేసుకుని ఉద్యమించింది. సిఎం కెసిఆర్ స్వయంగా ధర్నాకు దిగారు. ఓ రకంగా విపక్ష బిజెపి, కాంగ్రెస్ పార్టీలు బాగా ఉద్యమాలతో ముందుకు వెళ్ళే క్రమంలో బలం పుంజుకున్నాయనే చెప్పాలి. మునుగోడు ఉప ఎన్నికతో టిఆర్ఎస్‌కు కొంత ఊపు వచ్చింది. చచ్చు పడిపోతున్న దశలో కాంగ్రెస్ పార్టీకి గళం విప్పే అవకాశం చిక్కింది. పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నా పార్టీలో అసమ్మతి వాదులు కాళు లాగుతున్నారు.. అలాగే ఎపిలో అమరావతి ఉద్యమం బాగా బలపడింది. జగన్‌కు వ్యతిరేకంగా రైతులు ప్రజా ఉద్యమాన్ని నిర్మించగలిగారు. ఓటిఎస్ పథకంపై ఎపిలో ప్రజాగ్రహం వ్యక్తం అవుతోంది. చెత్తపన్ను కూడా ప్రజల్లో తీవ్రవ్యతిరేకతను చూపింది. దీనిని ఆసరగా చేసుకుని టిడిపి ఆందోళను చేపట్టింది. మొత్తంగా విపక్షాలు రాజకీయ లబ్దిపొందే యత్నాల్లో కొంతమేర విజయం సాధించాయని చెప్పాలి. సాగు, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలపై రైతులు ప్రత్యేకంగా డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ చట్టంలో కూడా సవరణలు చేపట్టేందుకు కేంద్రం బిల్లును తీసుకువస్తోంది. దీంతో సబ్సిడీపై విద్యుత్ పొందే అవకాశాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న రైతన్నలు కోల్పోవడం ఖాయమన్న ప్రచారం ఉంది. దీనిని తెలంగాణలో బాగా ప్రచారం చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని బడా వ్యాపారులు చేతుల్లో పెట్టేందుకు మోడీ సర్కార్ తలుపులు బార్లా తెరిచారన్న ప్రచారంలో బిఆర్ఎస్ బాగా దూసుకుపోతోంది. దేశంలో దాదాపు అన్ని పార్టీలను ఒక వైపు, భారతీయ జనతా పార్టీని మరో వైపు సమీకృతం చేశాయనడంలో సందేహం లేదు. ద్వారా బిజెపికి వ్యతిరేకంగా పరిస్థితిని తీసుకుని వచ్చామని భ్రమపడుతున్నాయి. మోదీ హిందుత్వ, దేశభక్తి కార్డులను విజయవంతంగా ఉపయోగించుకొన్నప్పుడల్లా ప్రతిపక్షాలు నీరుకారిపోయాయి. విపక్షాలు ఏకం కావడంవల్ల బిజెపికి లాభించే పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశవ్యాప్తంగా బిజెపి యేతర రాజకీయ పార్టీలు, అనేక ఇతర వర్గాలు సంఘటితం కావాలనే బిజెపి కోరుకుంటుందని భావించాలి. ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కావచ్చు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వైసిపి, టిఆర్ఎస్‌లు కూడా మాత్రం పూర్తిగా విఫలం అయ్యాయి.



# మేడారం జాతరను నేషనల్ ఫెస్టివల్‌గా గుర్తించాలి

**రాష్ట్రపతి ముర్ముకు సీతక్క వినతిపత్రం**

**ములుగు,డిసెంబర్29(ప్రజామంటలు):** మేడారం మహా జాతరను నేషనల్ ఫెస్టివల్ గా ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క డిమాండ్ చేశారు. జాతరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. రామప్ప సందర్శన కోసం ములుగు జిల్లాకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఎమ్మెల్యే సీతక్క కలిశారు. పలు ప్రజా సమస్యలపై రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించారు. మేడారం మహాజాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని కోరారు. దీనికి కేంద్రం నిధులను కేటాయిస్తే.. స్థానికంగా అభివృద్ధి ఊపందుకుంటుందని చెప్పారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అటవీ అధికారుల మధ్య ఆదివాసీలు, గొత్తి కోయలు నలిగిపోతున్నారని.. వారికి సంబంధించిన పోడు భూముల సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం మీడియాతో సీతక్క మాట్లాడుతూ.. తాను చేసిన వినతులపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సానుకూలంగా స్పందించారని చెప్పారు.

# జనవరిలో కరోనా కేసులు పెరిగే ప్రమాదం

**వచ్చే 40 రోజులు కీలకమని కేంద్రం ప్రకటన**

**న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు):** దేశంలో కరోనా పరిస్థితులపై కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మరింత ఫోకస్ పెంచింది. వచ్చే 40 రోజులు భారత్‌కు చాలా కీలకమని భావిస్తున్నారు. జనవరిలో కరోనా కేసులు పెరిగే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. కరోనా ఎఫెక్ట్ ఎక్కువున్న చైనా, హాంకాంగ్, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఇంగ్లండ్ దేశాల నుంచి వచ్చే వారికి నెగెటివ్ సర్టిఫికెట్ ఆదేశాలు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఎయిర్ పోర్టుల్లో విదేశాల నుంచి వచ్చే వారికి టెస్టులు చేయడం, ఐసోలేట్ చేయడం వంటి ఏర్పాట్లపైనా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సమీక్షించనుంది. అక్కడ సన్నద్ధతపై మాండవీయ ఫోకస్ పెట్టనున్నారు. ఇప్పటికే చైనా నుంచి వచ్చే వారు 48 గంటల ఖిఖఅఖీ రిపోర్ట్ తోనే తమ దగ్గర ల్యాండ్ అవ్వాలని అమెరికా ఇప్పటికే ఆదేశించింది.

# టాటా చైర్మన్ రతన్‌టాకు కెటిఆర్ జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు):** టాటా గ్రూప్ చైర్మన్, భారతీయ పారిశ్రామిక దిగ్గజాల్లో ఒకరైన రతన్ టాటా జన్మదినం సందర్భంగా



రతన్ టాటాకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. పలు సందర్భాల్లో రతన్ టాటాతో కొంత సమయం గడిపే అదృష్టం తనకు కలిగిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించడం, వినయం, హాస్య చతురత ఆయనలో కనిపిస్తాయని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇవన్నీ తనకు స్ఫూర్తినిస్తాయని కేటీఆర్ చెప్పారు.

# టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**ఏప్రిల్ 6నుంచి 13 వరకు పరీక్షల నిర్వహణ**


**హైదరాబాద్,డిసెంబర్29:** రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్ 3న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్‌కు సంబంధించి ఎస్సెస్సీ బోర్డు అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. పది పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగనున్నాయి. అలాగే ఈ యేడాది నుంచి ఆరు పేపర్ల విధానం అమల్లోకి రానుంది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారమే ఉత్తర్వులు జారీ చేసింది. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం భారీ సంస్కరణలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ విద్యాసంవత్సరం నుంచి 11 పేపర్లను కుదించి, 6 పేపర్లకే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో సబ్జెక్టులో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగతా 20 మార్కుల్ని ఫార్మెటివ్ అసెసెమెంట్‌కు ఇచ్చారు. 9వ తరగతి విద్యార్థులకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జీవో 33 జారీ చేశారు. ఇదివరకు వ్యాసరూప, సూక్ష్మరూప ప్రశ్నలు రెండింటిలోనూ విద్యార్థులకు చాయిస్ ఇచ్చేవారు. కానీఇప్పుడు వ్యాసరూప ప్రశ్నల్లోనే చాయిస్ ఉంటుంది. సూక్ష్మ రూప ప్రశ్నలకు చాయిస్ వర్తించదు. ఎగ్జామ్స్ టైమ్ టేబుల్ ఇలావుంది. ఎప్రిల్ 3- ఫస్ట్ లాంగ్వేజ్, ప్రిల్ 4- సెకండ్ లాంగ్వేజ్,ప్రిల్ 6- థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్),ఎప్రిల్ 8- గణితం, ఏప్రిల్ 10- సామాన్య శాస్త్రం(ఫిజిక్స్, బయాలజీ),ఏప్రిల్ 11- సాంఘిక శాస్త్రం,ఎప్రిల్ 12 -ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1,ఎప్రిల్ 13- ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు జరుగనున్నాయి.

# భర్త వేధింపులపై డిప్యూటీ డిఇ భార్య ఆందోళన

**నిర్మల్,డిసెంబర్29:** జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ కార్యాలయం ముందు డిప్యూటీ డీఈ వినోద్ బాబా భార్య పూర్ణిమ ఆందోళనకు దిగారు. భర్త తనను నిర్లక్ష్యం చేస్తూ మరో రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గుండాలతో బెదిరిస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వెల్లడించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదని పూర్ణిమ తెలిపారు. తనకు న్యాయం జరిగే వరకూ కదిలేది లేదంటూ అక్కడే బైఠాయించారు. ప్రస్తుతం డిప్యూటీ డీఈ వినోద్ బాబా పోలీసులు అదుపులో ఉన్నాడు.

# వరంగల్‌కు మరోమారు వ్యాక్సిన్ డోసులు

**వరంగల్,డిసెంబర్29:** వరంగల్ పరిధిలో కరోనా వ్యాక్సిన్ డోసులు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్ జిల్లాకు 200 టీకా డోసులు, హన్మకొండ జిల్లాకు 1000 టీకా డోసులను వైద్యాధికారులు తెప్పించారు. వరంగల్ కు చేరిన వ్యాక్సిన్ డోసుల్లో కొవిషీల్డ్ టీకాలు ఉన్నాయి. గురువారం నుంచే జిల్లాల పరిధిలో వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.గత రెండు నెలలుగా కొవిడ్ టీకా తీసుకునేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు.




దీంతో కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచి పోయింది. గత కొన్ని వారాలుగా ఒమైక్రాన్ 'బీఎఫ్ -7' సబ్ వేరియంట్ విజృంభిస్తుండటంతో వ్యాక్సినేషన్ చేయించుకునేందుకు ప్రజలు మళ్లీ ఆసక్తి చూపుతున్నారు.

# గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కేసులు తగ్గాయి.

- నూతన సంవత్సర వేడుకలు జాగ్రత్తగా చేసుకోవాలి
- జిల్లా ఎస్పి సింధు శర్మ

**జగిత్యాల డిసెంబర్ 29 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లాలో 2022 యేడాదిలో, గత ఏడాదితో పోలిస్తే కేసులు తగ్గాయని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఎస్ పి సింధూ శర్మ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ సంవత్సరం (2022)లో పోలీసుల జాగురుకత, పర్యవేక్షణ, ప్రజల సహకారంతో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీనికి కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందిస్తు, సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన కేసుల నమోదు వివరాలను ఎస్పీ వివరించారు. ఇంకా, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఎక్కువ కేసులు నమోదులో జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ మొదటిగా నిలువగా, తక్కువ కేసుల నమోదులో బీరపూర్ పోలీస్ స్టేషన్ ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితులు బయపడకుండ పిర్యాదు చేసేంధుకు ముందుకు వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందని, పిర్యాదుల నమోదు ప్రత్యక్షంగానే కాకుండా వాట్స్ అప్, ట్విటర్‌ల ద్వారా కూడా వచ్చాయని తెలిపారు. డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు విస్తృతంగా చేస్తున్న మన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ పోలీస్ పెట్రోలింగ్, బందోబస్తు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు పోలీసులకు సహకరించి, నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహలతో జరుపుకోవాలని కోరారు. ప్రజాల్కు, పోలీసులకు ఎస్పీ సింధూ శర్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో డి ఎస్పీ ప్రకాశ్, పోలీస్ అధికారులు ఉన్నారు.





కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్‌ని సన్మానించిన తుల రాజేందర్, అన్నవరం దేవేందర్, డా. కృష్ణారావు, ఆంజనేయ రావు.



# భారాస విస్తరణపై కర్ణాటక, మహారాష్ట్ర ప్రముఖులతో చర్చలు

**ధార్వాడ్, హుబ్లీబెంగళూరు, యావత్ మాల్ గిరిజన నాయకులతో బోయినపల్లి వినోద్ కుమార్ భేటీ**

**హైదరాబాద్ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వివిధ వర్గాల ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో, భారత్ రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్) పార్టీని కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో విస్తృతంగా విస్తరించేందుకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌తో విస్తారంగా చర్చించారు.

కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్, హుబ్లీ నగరాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, యాదవ, కుర్మ వర్గానికి చెందిన సిద్ధన్న తేజీ, బెంగళూరు నగరానికి చెందిన సహకార సెక్టార్ ఉద్యమ నాయకులు నవీన్, మహిళల సమస్యలపై ఉద్యమించే నాయకురాలు బెంగళూరుకు చెందిన ఉషారాణి, చిక్బల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కార్మిక నాయకులు ప్రకాష్, మహారాష్ట్ర యావత్ మాల్ జిల్లా పూసద్ ప్రాంతానికి చెందిన గిరిజన సంఘాల నాయకురాలు సింపుల్ రాథోడ్, అకోలా ప్రాంతానికి చెందిన అంబు నాయక్ లు బీ.ఆర్.ఎస్. పార్టీని తమ రాష్ట్రాల్లో అపూర్వంగా స్వాగతం పలుకుతామని వినోద్ కుమార్ కు తెలిపారు.

కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో రాజకీయ అస్థిరత ఉందని, ప్రజల జీవన స్థితి దారుణంగా ఉందని, తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రజలు కూడా కోరుకుంటున్నారని దార్వాడ్, హుబ్లీ నగరాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సిద్దన్న తేజి అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ కార్యక్రమం సోషల్ మీడియా ద్వారా కర్ణాటక రాష్ట్ర కుర్మ, యాదవ వర్గాలకు గమనించి... ఇలాంటి గొప్ప సంక్షేమ పథకం తమకు కావాలని కోరుకుంటున్నారన్న విషయాన్ని సిద్దన్న తేజీ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఇలాంటి పథకం కావాలన్న కర్ణాటక యాదవ, కుర్మ వర్గాల డిమాండ్ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి బొమ్మయ్ కూడా ఇటీవల గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రకటించారని సిద్దన్న తేజీ తెలిపారు.

త్వరలోనే బీ.ఆర్.ఎస్. పార్టీ కార్యాచరణను పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రకటిస్తారని, మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించి, ఆ దిశలో ముందడుగు వేద్దామని వినోద్ కుమార్ మహారాష్ట్ర, కర్ణాటక ప్రముఖులకు సూచించారు.





# యతో కృష్ణ స్తతో ధర్మః యతో ధర్మః స్తతో జయః

**అంబర్ పేట డిసెంబర్ 29( ప్రజా మంటలు):** శ్రీకృష్ణ పరమాత్మ ఎక్కడ ఉంటాడో అక్కడే ధర్మం ఉంటుందని ధర్మం ఉన్న దగ్గరే విజయం సంప్రాప్తమవుతుందని పెద్దల వాక్యమును సార్థకం చేయడానికి ప్రతి ఒక్కరూ ధర్మమార్గాన్ని ఆచరిస్తే తమ మనో వాంచితార్థాలు నెరవేరుతాయని నంబి వేణుగోపాల ఆచార్య కౌశిక అన్నారు. అంబర్ పేట రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్లో గురువారం శ్రీమద్ భాగవత సప్తాహం ఆరవ రోజుకు చేరుకుంది.శ్రీకృష్ణ అవతారం,బాల్య లీలలను ఆచార్యులు ప్రవచించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు కే. లక్ష్మణ సాయి ఆధ్యాత్మిక గీతాలాపనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలచే భక్తి గీతాలతో కూడిన దాండియా నృత్యాలు ఆద్యంతం అలరించాయి. దివ్య జ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విట్టల్ శర్మను, పలువురు ప్రముఖులను నిర్వాహకుల పక్షాన సిరిసిల్ల రామశర్మ నమిలకొండ రమణాచార్యులు జ్ఞాపిక శాలువాతో సత్కరించారు.







# నిఖత్ జరీన్, ఇషాసింగ్‌లకు కవిత అభినందనలు

**హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు):** జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారిణిలు నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందించారు. హైదరాబాద్‌లోని నివాసంలో నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లు ఎమ్మెల్సీ కవితను కలిసారు. జాతీయ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ తేజం నిఖత్ జరీన్ బంగారు పతకం సాధించగా, జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇషా సింగ్ రజత పతకం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వీరిద్దరి విజయాలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు



# గుంతల రోడ్లపై కాంగ్రెస్ నేత వినూత్న నిరసన

**కరీంనగర్,డిసెంబర్29:** రోడ్డు గుంతలమయం అయినా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ.. ఓ మహిళా కాంగ్రెస్ నేత తన భర్తతో కలిసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేసింది. రోడ్డుపై బైఠాయించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదకరంగా తయారైందని, ఇంటింటికి తిరుగుతూ.. బిక్షమెత్తి వచ్చిన డబ్బులతో గుంతలను పూడుస్తామన్నారు.

మహిళా కాంగ్రెస్ నేత రేణుక భర్త శివతో కలిసి వినూత్నంగా నిరసనకు దిగారు. 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి అయ్యా,,, బంగారు తెలంగాణ అంటే ఇదేనా ? మీరు చేసిన అభివృది' అంటూ ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఇక్కడున్న ప్రజాప్రతి నిధులు ఏం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రేణుక నిలదీశారు. రోడ్లపై ఉన్న దుమ్ముతో దుకాణదారులు, పాదాచారులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడి నుండి లారీల్లో ఇసుకను తీసుకెళుతున్నారే కానీ రోడ్డును బాగు చేయడం లేదని విమర్శించారు. ఓట్ల కోసం డబ్బులు ఖర్చు పెడుతున్నారు.. ఇక్కడి రోడ్డు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

# స్కూల్ విద్యార్థిని అదృశ్యం

**ఫిర్యాదుతో పోలీసుల గాలింపు**

**మెదక్,డిసెంబర్29:** జిల్లాలోని నర్సాపూర్ డాన్ బాస్కోలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల విద్యార్థిని అదృశ్యం కలకలం రేపుతోంది. పాఠశాలకు రాలేదని సిబ్బంది ఫోన్ చేయడంతో తండ్రి ఖలీల్ అప్రమత్తమయ్యాడు. రోజు మాదిరిగానే బైక్‌పై తునికి గేటు వరకు బాలికను తండ్రి తీసుకుని వచ్చాడు. తర్వాత విద్యార్థిని స్కూలుకు వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. నర్సాపూర్ బస్టాండ్‌లో బాలిక బస్సు ఎక్కినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. బాలిక ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# రామావతారంలో భద్రాదీశుడు

**భద్రాచలం,డిసెంబర్29:** దక్షిణాది అయోధ్య భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలంయలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ చంద్రుడు రోజుకో అవతారంలో దర్శనమిస్తున్నారు. బుధవారం పరశురామావతారంలో దర్శనమిచ్చిన రామయ్య తండ్రి.. ఏడో రోజైన గురువారం నిజరూపమైన శ్రీరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక జనవరి 1న గోదావరి నదిలో సీతారాముల తెప్పోత్సవం నిర్వహించనున్నారు. మరుసటి రోజున అంటే జనవరి 2న ముక్కోటి వైకుంఠ ఏకాదశి కావడంతో.. స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# శంషాబాద్‌లో మరోమారు భారీగా బంగారం పట్టివేత

**హైదరాబాద్,డిసెంబర్29:** శంషాబాద్ విమానాశ్రయంలో మరోసారి భారీగా విదేశీ బంగారం పట్టుబడింది. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద అధికారులు 827 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ అనే వ్యక్తివద్ద అక్రమంగా తరలిస్తున్న బంగారం పేస్ట్ లభించింది. దీంతో దానిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ 46.51 లక్షల ఉంటుందని చెప్పారు.

బంగారాన్ని కరిగించి పేస్ట్‌గా మార్చి టీ షర్ట్ వెనుక భాగానికి పూసుకుని తరలించడానికి ప్రయత్నించాడని అధికారులు తెలిపారు. విచారణ నిమిత్తం అతడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. బంగారాన్ని ఎక్కడి తీసుకెళ్తున్నాడనే విషయంపై ఆరాతీస్తున్నారు. అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్రానికి కొమ్ముకాస్తున్న గవర్నర్లు

## సిద్దిపేట కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

**సిద్దిపేట,డిసెంబర్29(ప్రజామంటలు):** గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్ లుగా పని చేస్తున్నారని.. గవర్నర్ వ్యవస్థను అడ్డు పెట్టుకుని సమాంతర ప్రభుత్వం నడిపిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 'ఛలో కలెక్టరేట్'కి పిలుపునిచ్చింది. అందులో భాగంగా సిద్దిపేట కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో చాడ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ప్రశ్నించే గొంతుకలను మోడీ ప్రభుత్వం అణిచివేస్తుందని విమర్శించారు. వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను బీజేపీ పడగొడుతోందని.. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ దొరికిపోయారన్నారు. ప్రతిపక్ష పార్టీల మీద ఈడీ, సీబీఐ దాడులు చేస్తూ అణిచి వేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసి నాశనం చేస్తున్నారని వెల్లడించారు. ఔఖీఇఉ఺ూ నిధులతో కల్లాలు నిర్మిస్తే తప్పేముందని..వాళ్ళు రైతులు కాదా అని ప్రశ్నించారు. గత కొంతకాలంగా గవర్నర్ వ్యవస్థపై సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో రాజ్ భవన్ ముట్టడించారు. రాజకీయ అజెండాలతో ప్రజా ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఇలాంటి గవర్నర్ వ్యవస్థ అవసరం లేదంటున్నారు.

# దర్శకనిర్మాత వల్లభనేని జనార్ధన్ కన్నుమూత


## సంతాపం తెలిపిన చిత్ర ప్రముఖులు

**హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు):** టాలీవుడ్ నటుడు, దర్శకనిర్మాత వల్లభనేని జనార్ధన్ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనార్ధన్ మృతిపట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. విజయవాడకు చెందిన వల్లభనేని జనార్ధన్‌కు చిన్నప్పటినుంచి నాటకాలు అంటే చాలా ఇష్టం ఉండేది. ఆ ఆసక్తితోనే కళాశాల విద్య అనంతరం కళామాధురి పేరుతో నాటక సంస్థను ప్రారంభించారు. ఈ క్రమంలో తెలిసినవారి పరిచయలతో ఇండస్ట్రీలోకి ఆడుగుపెట్టారు. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన గజదొంగ ఆయనకు మొదటిచిత్రం. సినిమాల్లో నటిస్తున్న టైమ్ లోనే జనార్ధన్.. దర్శకుడు విజయ బాపినీడు కుమార్తెను వివాహం చేసుకున్నారు. చిరంజీవి హీరోగా విజయ బాపినీడు దర్శకత్వంలో వచ్చిన గ్యాంగ్ లీడర్ చిత్రం జనార్ధన్‌కు మంచి పేరును తీసుకువచ్చింది. ఇందులో ఆయన హీరోయిన్ సుమలతకి తండ్రిగా నటించి మెప్పించారు. ఈ చిత్రం తరువాత ఆయనకు వరుసగా అవకాశాలు వచ్చాయి. కేవలం నటుడు గానే కాకుండా జనార్ధన్ దర్శకనిర్మాతగా కూడా రాణించారు. జనార్ధన్ కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

# ఉజ్బెకిస్థాన్‌లో దారుణం

## భారత్ దగ్గు సిరప్‌కు 18మంది పిల్లలు బలి

**న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు):** భారత్‌లో తయారు చేసిన దగ్గు సిరప్‌ను తాగిన 18 మంది పిల్లలు మరణించారని ఉజ్బెకిస్తాన్ ఆరోపించింది. ఈ దగ్గు మందులో ప్రమాదకరమైన పదార్థం ఉందని, తమ ల్యాబొరేటరీ పరీక్షల్లో తేలిందని చెప్పింది. పిల్లలు తీసుకున్న ఈ సిరప్ నోయిడాకు చెందిన మారియన్ బయోటెక్



తయారు చేసిన దగ్గు మందు డాక్ 1మాక్స్ గా నిర్ధారించిన ఉజ్బెకిస్తాన్.. అందులో విషపూరితమైన ఇథిలీన్ గ్లైకాల్ ఉన్నట్టు తెలిపింది. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా వారి తల్లిదండ్రులు, ఫార్మసిస్ట్‌ల సలహా మేరకు, పిల్లలకు ప్రామాణిక మోతాదు కంటే ఎక్కువ మొత్తంలో సిరప్‌ను పిల్లలకు అందించినట్లు కూడా పేర్కొంది. పిల్లలు, ఆసుపత్రిలో చేరే ముందు ఈ సిరప్‌ను 2-7 రోజుల పాటు ఇంట్లో 2.5 నుండి 5 ప మోతాదులో రోజుకు 3 నుండి 4 సార్లు తీసుకున్నట్లు వెల్లడించింది. కాగా ఇది ప్రామాణిక మోతాదు కంటే ఎక్కువని మంత్రిత్వ శాఖ తెలిపింది. జలుబు తగ్గేందుకు కూడా ఆ తల్లిదండ్రులు పిల్లలకు ఈ సిరప్‌ను తాగించారని చెప్పింది. డాక్-1 మ్యాక్స్ ట్యాబ్లెట్లు, సిరప్‌ను అమ్మకూడదని ఇప్పటికే ఉజ్బెకిస్థాన్ నిర్ణయించుకుంది. దీని అమలులో విఫలమైన ఏడుగురు ఉద్యోగులను కూడా విధుల నుంచి తొలగించినట్టు ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాగా ఈ ఘటనపై భారత్ విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఉత్తర్ ప్రదేశ్ డ్రగ్స్ కంట్రోలింగ్, లైసెన్సింగ్ అథారిటీ విచారణ చేస్తోందని సమాచారం. పిల్లల మరణాలపై అంచనా రిపోర్టు కావాలని ఉజ్బెకిస్థాన్‌ను ఆ సంస్థలు కోరాయి. భారత్ లో తయారైన సిరప్ తాగి వేరే దేశాల్లో పిల్లలు మరణించడం ఈ ఏడాది ఇది రెండోసారి కావడం అందర్నీ ఆందోళనకు గురిచేస్తోంది. హర్యానాకు చెందిన మైడెన్ ఫార్మాసూటికల్స్ తయారు చేసిన దగ్గు సిరప్ తాగిన తర్వాత ఆఫ్రికన్ దేశమైన గాంబియాలో 70 మంది పిల్లలు చనిపోయిన ఘటన అక్టోబర్‌లో జరిగింది.

# కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

## మంత్రి హరీష్ రావు ప్రకటన

**పెద్దపల్లి,డిసెంబర్29(ప్రజామంటలు):** ఎలాంటి కరోనా పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని..కంటికి రెప్పలా కాపాడుకునేందుకు తమకు కేసీఆర్ ఉండని చెప్పారు. రామగుండంలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన హరీశ్ .. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల బతుకులు మార్చే నాయకుడని అన్నారు. కేసీఆర్ దేశానికి దిక్సూచి అని కొనియాడారు. వైద్య సేవల్లో తెలంగాణ దేశంలో మూడోస్థానంలో నిలిచిందని హరీశ్ రావు అన్నారు. అత్యధిక మంది డాక్టర్లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రెండేళ్లుగా కరోనా వల్ల ఆర్థిక ఇబ్బందులు వచ్చినా రాష్ట్ర ప్రగతి ఆగుతలేదన్నారు. మళ్లీ కరోనా వస్తదంటున్నారు..కానీ ప్రజలంతా భయపడకుండా ధైర్యంగా, భరోసాతో ఉండాలన్నారు. ఎందుకంటే సీఎం కేసీఆర్ ఉండని.. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతుందని హరీశ్ ఆరోపించారు. ఇవాళ రైతుబంధు, మిషన్ భగీరథ వంటి రాష్ట్ర పథకాలను కేంద్రం దేశ వ్యాప్తంగా అమలు చేస్తుందన్నారు. కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని పార్లమెంట్ లో మెచ్చుకుని రాష్ట్రంలో విమర్శలు చేస్తుందని అన్నారు.

# మోడల్ స్కూల్స్ లలో మనఊరు-మనబడి పథకం

## పనులు ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేయాలి

## అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణీ

**హన్మకొండ డిసెంబర్ 29 ( ప్రజామంటలు) :** మన ఊరు-మన బడి' పథకం కింద కేటాయించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో, ఎస్ఎంసీ చైర్మన్లు, ఎంఈవో, ఎంపీడీవో, ఏపీవో, ఇంజనీరింగ్ విభాగం ఏఈ, డీఈల లతో హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'మన ఊరు-మన బడి' పనులను ప్రతి పాఠశాలలో జరుగుతున్న పనులు ఆలస్యం అవుతున్న కారణంగా, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పర్యవేక్షించి, మండలాలవారిగ ఆత్మకూరు-భీమ దేవర పల్లి దామెర-,ధర్మసాగర్, ఎల్కతుర్తి, హన్మకొండ, హసన్ పర్తి, ఐనవోలు, కమలాపూర్, , కాజీపేట, , నడికుడ, పరకాల, శాయం పేట-, వేలేరు లలో ఎంపిక చేసిన మోడల్ స్కూల్స్ లలో మొత్తం 28 పాఠశాలల్లో పనులన్ని%శీ%టిని సత్వారమే పూర్తి చేసి, పూర్తి అయిన పనులకు వెంటనే ఎంబి రికార్డు చేసి, బిల్స్ అప్రూవ్ చేయించుకోవాలన్నారు. వర్క్ పూర్తి అయిన వెంటనే పెయింటింగ్ చేసి, పూర్తి అయిన మొత్తం 28 మోడల్ స్కూళ్ల ను జనవరి 7 వ తేదీ లోగా ప్రారంభోత్సవనకు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. ప్రస్తుతం 12 స్కూల్లలో పనులు పూర్తయి పెయింటింగ్ కు సిద్ధంగా వున్నాయని,వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా పనులు ప్రారంభించని గ్రామాల్లో రెండు రోజుల్లోగా ఉపాధి హామీ పనులను ప్రారంభించలని, లేనిచో షోకాజ్ నోటీసులు



ఇస్తామన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు సర్పంచులతో సమన్వయము చేసుకొని పనులు త్వరగా పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమం లో డీఈవో అబ్దుల్ హై, డిఎంహెచ్ఓ శ్రీనివాస్, ,స్పెషల్ ఆఫీసర్లు, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోకి వినతి పత్రం అందించిన మండల కాంగ్రెస్ సర్పంచులు

**గొల్లపల్లి డిసెంబర్ 29 (ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ సర్పంచులకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడాన్ని నిరసిస్తూ మండల కార్యాలయం వద్ద సర్పంచులు నిరసన తెలియజేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో వినతి పత్రం అందించిన సర్పంచులు. గొల్లపల్లి గ్రామ సర్పంచ్ నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ.... గడిచిన 11 నెలల నుండి కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీలకు ఇవ్వవలసిన నిధులు రావడం లేదు గడిచిన ఐదు నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు రావడంలేదని వాపోయారు. అదే విధంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందికరంగా మారింది గ్రామ పంచాయతీకి సంబంధించిన



ట్రాక్టర్ కు కిస్తీలు మరియు డైలీ మెయింటెనెన్స్ చేయలేకపోతున్నామని వాపోయారు. కనుక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ నిధులని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సర్పంచ్ మస్కు నిశాంత్ రెడ్డి , భీమ్రాజు పల్లి సర్పంచ్ రేవల్ల సత్యనారాయణ గౌడ్, ఇబ్రాజ్ పల్లి సర్పంచ్ చిర్ర గంగాధర్, అబ్బాపూర్ సర్పంచ్ పురంశెట్టి పద్మ వెంకటేష్, శంకర్రావుపేట సర్పంచ్ సరసాని రాజ్యలక్ష్మి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా సాహితీ మకుటంలో మరో అవార్డు

## విమర్శకులు వారాల ఆనంధ్ కు కేంద్ర పురస్కారం

## సాహితీవేత్తల హర్షం

**కరీంనగర్ డిసెంబర్ 30(ప్రజా మంటలు) :** కరీంనగర్ జిల్లా సాహితీ చరిత్రలో మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రతి సంవత్సరం వివిధ సాహితి రంగాల్లో కేంద్రం అందించే సాహిత్య అకాడమీ పురస్కారం మళ్ళీ జిల్లాసాహితీవేత్తకు దక్కింది. ఇంత వరకు ఉమ్మడి జిల్లాలో అయిదుగురు సాహితి వేత్తలు ఈ పురస్కారం అందుకోగా, సినీ విమర్శకుడు, రచయిత, కవి వారాల ఆనంధ్ కు పురస్కారం ప్రకటించడం జిల్లావాసుల్లో ఆనందాన్ని నింపుతోంది. కారింనగర్ జిల్లా నుంచి మొద టిసారి ఈ పురస్కారం డాక్టర్ సి.నారా యణరెడ్డి అందుకోగా, అనంతరం బహు భాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ అనువాద సాహిత్యంలో అందుకున్నారు. సాహిత్యంలో మెట్పల్లికి చెందిన వాసాల నర్సయ్య, సిరిసిల్లకు చెందిన నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సంపాదకులు డాక్టర్ పత్తిపాక మోహన్లను పురస్కారాలు వరించాయి. తాజాగా కరీంనగర్కు చెందిన వారాల ఆనంద్ ఈ ఘనత సాధించారు. గ్రంథ పాలకుడిగా పదవీ విరమణ చేసిన ఆనంద్ సాహిత్యం, సినీ రంగాలను



అధ్యయనం చేస్తు న్నారు. చైతన్య వ్యాసాలు రాస్తున్నారు. ఆన్లైన్ రేడియో ద్వారా సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వివిధ యూట్యూబ్ చానల్లాలో, ఆన్ లైన్ రేడియోలో, ఇరుగు పొరుగు, మంచి సినిమా, ప్రముఖ దర్శకుల ప్రత్యేకతల విశ్లేషణ కథనాల'ను అందిస్తున్నారు. అనువాదం సాహిత్యం తోపాటు వ్యాసాలు, కవితలు రాస్తు న్నారు. గతంలో ఆనంద్ రాసిన పుస్త కాలు ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి. సమయం దొరి కినప్పుడు ఆయన నచ్చిన కవితలను అనువది స్తుంటారు. స్వయంగా రాస్తుం టారొ. ఇందులో భాగంగా గ్రీన్ పోయమ్స్ ' పేరుతో ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు గుల్జార్ రాసిన హిందీ కవితలను 'ఆకుపచ్చ కవితల' పేరుతో 2018లో తెలుగులోకి అను వదించగా కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైంది. తెలంగాణ కళావే దిక అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, సమైక్య సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, కె.ఎస్. అనంతాచార్య, తెరవే అధ్యక్ష, కార్యదర్శులు కందు కూరి అంజయ్య, సి. వి. కుమార్, అన్నవరం దేవేం దర్, బూర్ల వెంకటేశ్వర్లు, నగునూరి శేఖర్, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ నలిమెల భాస్కర్, సంకేపల్లి నాగేంద్రశర్మ, తదితరులు అభినందనలు తెలిపారు.

# జరసం ఆధ్వర్యంలో 'సిరిసిల్ల రాజేశ్వరి'కి కొవ్వొత్తులతో అశ్రునివాళి

**జనగామ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** జనగామ రచయితల సంఘం జనగామ అధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన బాల కవయిత్రి సిరిసిల్ల రాజేశ్వరికి గురువారం అంబేద్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో అశ్రునివాళి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుద్దాల హనుమంతు జాతీయ అవార్డు గ్రహీత బాల కవయిత్రి చిన్నారి సిరిసిల్ల రాజేశ్వరి అస్తమయంతో మానవతా సాహితీ లోకం చిన్నబోయిందని అన్నారు. చెదరని ఆత్మవిశ్వాసం ఆమె కవిత్వం సృజించారని అన్నారు.నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన రాజేశ్వరి జీవితాన్ని వైకల్యం చిన్న భిన్నం చేసిందన్నారు. ఎక్కడ చెదరని గుండేనిబ్బరంతో కాళ్ల ను చేతులుగా మలచుకుని తన ఆత్మవిశ్వాసాన్ని అక్షరాలుగా నిలబెట్టి ఎన్నో కవితలు రాశారన్నారు."సంకల్పం ముందు వైకల్యం ఎంత! దృఢ చిత్తం ముందు దురదృష్టం ఎంత! ఎదురీత ముందు విధిరాత ఎంత. పోరాటం ముందు ఆరాటం ఎంత.రాజేశ్వరి రాసిన కవితను గమనిస్తే ఆమె అక్షరాల పదును అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో



జరసం అధ్యక్షులు అయిలా సోమనర్సింహచారి, కవులు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి,పొట్టబత్తిని భాస్కర్,లగిశెట్టి ప్రభాకర్, గడ్డం మనోజ్ కుమార్, రంగరాజు ప్రసాద్, చిలుమోజు సాయికిరణ్,బుదారపు లావణ్య,చాపల మహేందర్, గూటం రమేష్,పొట్టబత్తిని శైలజ, సంకటి బాల నర్సయ్య,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## హరి అశోక్ కుమార్ కు మాతృ వియోగం

జగిత్యాల డిసెంబర్ 29 (ప్రజామంటలు): టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తల్లి పుప్పాల అనసూయ (90) సాయంత్రం 5 గంటలకు గుండె పోటుతో మృతి చెందారు. స్వాతంత్ర్య సమరయోధులు పుప్పాల నారాయణ సతీమణి పుప్పాల అనసూయ. ఆమె మృతిపట్ల జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యే లు సంజయ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్,టీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, రెవెన్యూ జిల్లా అధ్యక్షుడు వకీల్, పలు సంఘాల ప్రతినిధులు, "ప్రజామంటలు తెలంగాణ జాతీయ దినపత్రిక" ఎడిటర్ సిహెచ్. వి. ప్రభాకర్ రావు, ప్రజామంటలు పాత్రికేయ బృందం వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# సరైన సమయంలో సరైన విధంగా స్పందిస్తా

## ఫామ్‌హౌజ్ కేసుపై బిజెపి నేతల బిఎల్ సంతోష్

**హైదరాబాద్,డిసెంబర్29(ప్రజామంటలు):** ఫామ్ హౌస్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలపై బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎస్ సంతోష్ స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలకు సరైన సమయంలో సరైన సమాధానం చెబుతానని అన్నారు. తాను ఎవరో తెలియకపోయినా.. తన పేరు మాత్రం ఇంటింటికి వెళ్లిందన్నారు. తెలంగాణలో తన పేరు పాపులర్ అయిపోయిందన్నారు. తెలంగాణ తల్లి పేరుతో గెలిచి.. ఆ తల్లి రొమ్మును గుద్దారంటూ బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి విమర్శించారు. తెలంగాణలో దుర్మార్గపు పాలనను పారద్రోలాలంటూ కార్యకర్తలకు సంతోష్ పిలుపునిచ్చారు. శామీర్‌పేటలో జరుగుతున్న బీజేపీ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. బీజేపీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. మరోవైపు బలమైన ఆధారాలు లేకుండా ఆరోపణలు ఎలా చేస్తామని బీఆర్ఎస్ నేతలపై బీజేపీ మండిపడుతోంది. సమయం వచ్చినప్పుడు ఎవరు ఏంటో తెలుస్తుందన్నారు. త్వరలోనే ప్రజలకు కూడా నిజనిజాలు తెలుస్తాయని బీజేపీ నేతలు అన్నారు.

# గుంటూరు దంపతుల పిల్లలు క్షేమం

## అరిజోనా భద్రతా విభాగంలో రక్షణ

**గుంటూరు,డిసెంబర్29(ప్రజామంటలు):** అమెరికాలో విహారయాత్రకు వెళ్లి గల్లంతైన గుంటూరుకు చెందిన తెలుగు దంపతుల పిల్లలు క్షేమంగా ఉన్నారు. వీరి కుమార్తెలు ఇద్దరూ అరిజోనాలోని పిల్లల భద్రతా విభాగంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గడ్డకట్టిన సరస్సుపై నడుస్తున్న సమయంలో వీరు కూడా మంచులో పడిపోయారు. వీరిద్దరూ ఒడ్డుకు దగ్గరగా ఉండటంతో అధికారులు సురక్షితంగా రక్షించారు. డిసెంబరు 26న మధ్యాహ్నం అరిజోనాలోని కోకోనినో కౌంటీలోని వుడ్స్ కాన్యన్ లేక్ వద్ద.. పిల్లలతో విహారయాత్రకు వెళ్లిన దంపతులు మంచులో మునిగిపోయి మరణించారు. నారాయణ ముద్దన, గోకుల్ మెడిసేటి, బాధిత మహిళ హరిత ముద్దన మృతదేహాలను అధికారులు వెలికితీశారు. క్రిస్మస్ వేడుకలు చేసుకున్న తర్వాత పిల్లలతో కలిసి వీరంతా వుడ్స్ కాన్యన్ లేక్ వద్దకు వెళ్లారు. అక్కడ సరస్సు పై నడుస్తున్న సమయంలో మంచులో నుంచి పడిపోయారు. అయితే.. హరితను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆమె మరణించినట్లు అధికారులు గుర్తించారు. సరస్సులో పడిపోయిన నారాయణ, మెడిసేటి కోసం సిబ్బంది గాలించారు. మంగళవారం మధ్యాహ్నానికి వారి ఇద్దరి మృతదేహాలను కూడా వెలికితీశారు. అయితే.. మంచు తుఫాన్ కారణంగా అమెరికన్లు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. ఈ మంచు తుఫాను ప్రారంభమైన దగ్గర నుంచి శీతల గాలుల వల్ల, అలాగే రోడ్డు ప్రమాదాల వల్ల ఇప్పటి వరకు దాదాపు 50 మంది మరణించారు.

# కందుకూరు ఘటనకు చంద్రబాబుదే బాధ్యత: సజ్జల

**అమరావతి,డిసెంబర్29(ప్రజామంటలు):** నెల్లూరు జిల్లాలోని కందుకూరులో జరిగిన తొక్కిసలాట ఘటనకు టీడీపీ అధినేత చంద్రబాబు బాధ్యత వహించాలని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కావాలనే



ఇరుకు రోడ్డులో చంద్రబాబు సభ పెట్టారని సజ్జల విమర్శించారు. జనం ఎక్కువగా వచ్చారని చూపించేందుకే ఇరుకు రోడ్డులో చంద్రబాబు సభ తలపెట్టారని సజ్జల ఆరోపించారు. మంత్రులు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. ఇందుకు చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. కందుకూరులో చంద్రబాబు సభలో తొక్కిసలాట జరిగి ఎనిమిది మంది మృతి



చెందారు. ప్రమాద విషయం తెలియగానే రాత్రి 10.40 గంటల ప్రాంతంలో జేసీ కూర్మనాథ్, ఎస్పీ విజయరావు కందుకూరుకు వచ్చి.. ప్రమాద స్థలిని ఎస్పీ పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులతో ఇరువురూ మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా, రాత్రి 10 గంటల ప్రాంతంలోనే సబ్‌కలెక్టర్ శోభిక ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులతో మాట్లాడారు.

# గాయపడ్డ పిచ్చియ్య ఫిర్యాదుతో కేసు

## ఎస్పీ విజయరావు వెల్లడి

**నెల్లూరు,డిసెంబర్29(ప్రజామంటలు):** ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు సభ కోసం పోలీసుల అనుమతి తీసుకున్నారని ఎస్పీ విజయరావు తెలిపారు. జనం ఒక్కసారిగా చేరడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. గాయపడ్డ పిచ్చయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని విజయరావు తెలిపారు. కందుకూరు సభలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, కేసు విచారణకు డీఎస్పీ స్థాయి అధికారిని నియమించామని డీఐజీ త్రివిక్రమ్ పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి సెక్షన్లు నమోదు చేస్తామని తెలిపారు. కందుకూరులో చంద్రబాబు సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎనిమిది మంది మృతి చెందారు. ప్రమాద విషయం తెలియగానే రాత్రి 10.40 గంటల ప్రాంతంలో జేసీ కూర్మనాథ్, ఎస్పీ విజయరావు కందుకూరుకు వచ్చి.. ప్రమాద స్థలిని ఎస్పీ పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులతో ఇరువురూ మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా, రాత్రి 10 గంటల ప్రాంతంలోనే సబ్‌కలెక్టర్ శోభిక ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులతో మాట్లాడారు.

# మ్యాక్స్ కఫ్ సిరప్ ఉత్పత్తి నిలిపివేత

## ఉజ్బెక్ ఘటనతో కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు):** ఉత్తరప్రదేశ్‌లోని ఫార్మసీ కంపెనీ మారియన్ బయోటెక్ సంస్థ తయారు చేస్తున్న డాక్-1 మ్యాక్స్ దగ్గు సిరప్ ఉత్పత్తిని నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఉజ్బెకిస్తాన్‌లో ఆ దగ్గు మందు తాగిన 18 మంది చిన్నారులు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రొపైలీన్ గ్లైకాల్ ఉన్న డ్రగ్స్‌ను మారియన్ బయోటెక్ సంస్థ తక్షణమే ఉత్పత్తిని ఆపేయాలని ప్రభుత్వం పేర్కొన్నది. ఆ దగ్గు మందు తాగిన చిన్నారులు శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడినట్లు తెలుస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ జోక్యం చేసుకోవడం వల్ల.. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, యూపీ డ్రగ్స్ కంట్రోలింగ్ అండ్ లైసెన్సింగ్ అథారిటీలు డిసెంబర్ 27వ తేదీన మారియన్ బయోటెక్ కంపెనీలో తనిఖీలు చేపట్టాయి. ఎలాంట్ నుంచి సేకరించిన శ్యాంపిల్లను టెస్టింగ్ కోసం పంపించారు. కొన్ని నెలల క్రితం గాంబియాలో కూడా మేడిన్ ఇండియా దగ్గు సిరప్‌లు తీసుకోవడం వల్లే 76 మంది చిన్నారులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో
# వడ్లకొండ విద్యార్థిని 'సాహితీ' ప్రతిభ

**జనగామ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం పాఠశాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గణిత ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జనగామ జెడ్పిహెచ్ఎస్ వడ్లకొండకు చెందిన 10వ తరగతి విద్యార్థిని తెలుగు మీడియం



విభాగంలో బొల్లం సాహితీ అత్యున్నత ప్రతిభ కనపరచి హయత్ నగర్ రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పోటీలలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర గణిత ఫోరం వారిచే రూ. 2700 నగదు పురస్కారం ప్రశంసా పత్రం మెడల్ తో సత్కరించబడి జనగామ జిల్లాను రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపింది. ఈ సందర్భంగా విద్యార్థిని ని మరియు గైడ్ టీచర్ మల్లవరం శ్రీధర్ రెడ్డిలను జనగామ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, సర్పంచ్ బొల్లం శారద, ఎస్.ఎం.సి. చైర్మన్ బర్ల సిద్ది మల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం, టిఎంఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మూల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర కుమార్, జిల్లా బాధ్యులు వాసుదేవ రెడ్డి, రవీందర్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయిలో నిలువాలని సూచించారు.

## గాంధీ ఆసుపత్రిలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్
# ఉద్యోగుల డిమాండ్ల పోస్టర్ ఆవిష్కరణ

**సికింద్రాబాద్ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** టీ.ఎన్.జీ.వో. యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ ను గురువారం గాంధీ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈసందర్బంగా గాంధీ ఆసుపత్రిలోని ఎంప్లాయిస్



తో సమావేశమైన జిల్లా టీ.ఎన్.జీ.వో. ప్రెసిడెంట్ డా.ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్) వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంప్లాయిస్ డిమాండ్ల పోస్టర్ ను ఆవిష్కరించారు. అలాగే జనవరి 6న నాంపల్లి గృహకల్ప లో డైరీ, 2023 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాల్సిందిగా గాంధీ ఎంప్లాయిస్ ను ఆహ్వానించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని ఆ రోజు రాష్ట్ర మంత్రులు మహమద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవితలకు టీఎన్జీవో యూనియన్ తరపున విజ్ఞప్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి టీఎన్జీవో ప్రెసిడెంట్ జి. ప్రభాకర్, సెక్రటరీ కె. యాదిలాల్, వైస్ ప్రెసిడెంట్ లు ఖలీమ్, ప్రసన్న ఆనంద్, ప్రతినిధులు రహీమ్, మక్సూద్, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రవీన్, భావన, యూసుఫ్, శైలజ, జిల్లా యూనియన్ సెక్రటరీ విక్రమ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీనివాస్, శంకర్, రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలు కూడ ముఖ్యమే
### తలసాని క్రికెట్ లీగ్ ప్రారంభం

**సికింద్రాబాద్ డిసెంబర్ 29 (ప్రజామంటలు):** చదువుతో పాటు క్రీడల పట్ల సైతం యువత దృష్టి పెట్టాలని, క్రీడలతో శారీరక దారుడ్యం కలగడంతో పాటు మానసికొల్లాసం కలుగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పిలుపునిచ్చారు. గురువారం అమీర్ పేట లోని మున్సిపల్ గ్రౌండ్ లో మూడు రోజుల పాటు నిర్వహించే తలసాని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలలో పాల్గొనడం వలన ఆరోగ్యవంతంగా, దృఢంగా ఉంటారని చెప్పారు. దేశంలో అనేక క్రీడలు ఉన్నప్పటికీ క్రికెట్ కు అత్యధిక ఆదరణ ఉందని పేర్కొన్నారు. క్రీడలలో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి తో పాటు మెమెంటో లను అందజేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీ.ఆర్.ఎస్ నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్, సంతోష్, గులాబ్ సింగ్, సుమిత్ సింగ్, కరుణాకర్ రెడ్డి, చింటు, కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ,డిసెంబర్29(ప్రజామంటలు):** నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సభలో తొక్కిసలాట జరిగి 8 మంది మరణించడంపై ప్రధాని మోదీ, ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'నెల్లూరు జిల్లా బహిరంగ సభలో జరిగిన దుర్ఘటనపై తీవ్రంగా కలత చెందాను. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారాన్ని మంజూరు చేస్తాం' అని ప్రధాని గురువారం ట్విటర్లో పేర్కొన్నారు. సీఎం జగన్ కూడా మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున అందించాలని అధికారులకు ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామన్నారు.

# మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశము

### మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్

**జగిత్యాల 29 డిసెంబర్ (ప్రజామంటలు):** మున్సిపల్ సమావేశ మందిరంనందు మున్సిపల్ అన్ని విభాగాల అధికారులు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశము ఏర్పాటు చేసిన మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్. చైర్పర్సన్ మాట్లాడుతూ.... సిబ్బంది అందరూ కలిసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు. అభివృద్ధి పనులు, ట్రీ పార్కులు వెనువెంటనే పూర్తి చేయాలని, వార్డులలో హరితహారం మొక్కలను పర్యవేక్షించాలని, ట్రీ పార్కుల ఏర్పాటుకు వార్డుల యందు అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. వార్డుల్లో తడి పొడి చెత్త వేరుగా సేకరించాలని రిసోర్స్ పర్సన్స్ ద్వారా అవగాహన కల్పిస్తూ 100 శాతం సేగ్రిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ వార్డు ప్రజలకు అవహగన కల్పిస్తూ మెరుగుపరచాలని, వార్డు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వెను వెంటనే పరిష్కరించాలని, నిర్దిష్ట ప్రణాళికతో పన్నుల వసూలు చేయాలని, పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని,ముఖ్యముగా అత్యవసర సేవలు అయిన పారిశుధ్యము, ఇంటి ఇంటి చెత్త సేకరణ, నీటి సరఫరా మరియు విధి దీపముల నిర్వహణ లో ఎలాంటి అంతరాయలములు లేకుండా ముందస్తు ప్రణాళికతో చేపట్టుటకు తెలిపారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని పని చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని



ఆదేశించినారు. ఈ సమావేశము యందు మున్సిపల్ కమిషనర్ డా. నరేష్, డిఈ రాజేశ్వర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కందుకూరు విషాద బాధితులకు
# ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల సాయం

**అమరావతి,డిసెంబర్29(ప్రజామంటలు):** అధ్యక్షుడి నుంచి సామాన్య కార్యకర్తదాకా... 'కందుకూరు' విషాదం తెలుగుదేశం శ్రేణులను తీవ్రంగా కలచి వేసింది. సామాన్యుల నుంచి ప్రధాని దాకా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గురువారం బాధితులందరి ఇళ్లకూ వెళ్లారు. మృతులకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ తరపున తొలుత ప్రకటించిన రూ.10 లక్షల సహాయాన్ని.. రూ.15 లక్షలకు పెంచారు. ఆ చెక్కులను కూడా అందజేశారు. ఇక.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 లక్షల చొప్పున విడివిడిగా పరిహారం ప్రకటించాయి. టీడీపీ నేతలూ తమ వంతుగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించారు. ఇవన్నీ కలిపితే ఒక్కోకుటుంబానికి రూ.29 లక్షల వరకు సహాయం అందుతుందని టీడీపీ తెలిపింది. మరింత సహాయం కూడా చేస్తామని చంద్రబాబు తెలిపారు.

"నా నలభై ఐదేళ్ల రాజకీయ జీవితంలో ఇంతటి విషాద ఘటన ఎన్నడూ చూడలేదు. నా మనసు చలించిపోతోంది" అని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. టీడీపీ బాధ్యతారాహిత్యమే వారి మరణానికి కారణమంటూ రాష్ట్ర మంత్రులు బాధ్యతలేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తానెవరినీ నిందించడం లేదన్నారు. కానీ ఇందులో పోలీసు వైఫల్యం ఉందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను పర్యటనకు వస్తున్నప్పుడు కనీస బందోబస్తు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కందుకూరు మండలం కొండముడుసుపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ప్రభుత్వ హయాంలో ఏ సెలబ్రిటీ సభలకైనా, పాదయాత్రలకైనా పోలీసులు ఇలా పట్టీపట్టనట్లు వ్యవహరించారా అని ప్రశ్నించారు.

ఘటన జరిగాక తమ కార్యకర్తలే బాధితులను ఆస్పత్రిలో చేర్పించారంటే పోలీసులు ఎలా ఉన్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు. వైసీపీ నాయకులు కనీస బాధ్యత లేకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాగా.. పోస్టుమార్టం అనంతరం గురువారం ఉదయం కందుకూరు ఏరియా ఆస్పత్రిలో ఎనిమిది మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ ఘటనలో మరణించిన కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఏడుగురు కార్యకర్తల నివాసాలకు పార్టీ నేతలతో కలిసి చంద్రబాబు వెళ్లారు. విషణ్ణవదనంతో మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తొలుత ఓగూరు ఎస్సీ కాలనీలో గడ్డం మధుబాబు నివాసానికి చేరుకున్న చంద్రబాబు.. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అన్నివిధాలా పార్టీ అండగా ఉంటుందని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పిల్లలను చదివిస్తామని భరోసా ఇచ్చారు. మధుబాబు కుమారుడు కార్తికేయ రోదిస్తూ.. 'మాకు డబ్బులు వద్దు సార్.. మా నాన్న కావాలి' అని భోరున విలపించడంతో చంద్రబాబు ఆ అబ్బాయిని దగ్గరకు తీసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా పార్టీ తరపున రూ.15 లక్షల చొప్పున చెక్ అందజేశారు. అలాగే రూ.ఒకటిన్నర లక్ష నగదు కూడా ఇచ్చారు.

అనంతరం గుర్రంవారిపాలెంలో కాకుమాని నాగరాజు కుటుంబ సభ్యులను, కొండముడుసుపాలెం ఎస్సీ కాలనీలో కలవకూరి యానాది కుటుంబ సభ్యులను ఓదార్చి.. ఆర్థిక సాయం అందజేశారు. ఈ రెండు కుటుంబాల్లోని విద్యార్థుల చదువు బాధ్యత కూడా ఎన్టీఆర్ ట్రస్టు తీసుకుంటుందని ప్రకటించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేసినా తాను సుదీర్ఘ పాదయాత్ర చేసినా ఎప్పుడూ ఎలాంటి దుర్ఘటన జరగలేదని ఆయన విలేకరులతో అన్నారు. అత్యంత దురదృష్టకర ఘటన జరిగిందని.. బాధిత కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

**చంద్రన్న వచ్చాడు చూడమ్మా..**

అనంతరం ఉలవపాడులోని వరిగచేను సంఘం ఎస్టీ యానాది కాలనీకి చెందిన పార్టీ కార్యకర్త యాటగిరి విజయ ఇంటికి చేరుకున్నారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె భర్త శీనయ్య, కూతుళ్లు తిరుమల, శిరీష, కుమారుడు శ్రీకర్లను పరామర్శించారు. 'మా నాయకుడు చంద్రబాబును చూసి తరించాల్సిందేనని పట్టుపట్టి మీ మీటింగ్కు వచ్చింది సార్.. మిమ్మల్ని చూసే మా అమ్మ కన్ను మూసింది.. అమ్మా.. మన చంద్రన్న వచ్చాడమ్మా.. లేచి చూడమ్మా' అని విజయ కుమారుడు శ్రీకర్ అన్న మాటలకు చంద్రబాబు చలించిపోయారు. పెద్దకుమార్తె తిరుమల డిగ్రీ పూర్తిచేశానని చెప్పడంతో గుంటూరులో ఉన్న మీ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా ఉద్యోగం చూడాలని పక్కనే ఉన్న కనిగిరి ఇన్చార్జి ఉగ్రనరసింహారెడ్డికి చంద్రబాబు సూచించారు. చిన్న కూతురు శిరీషకు తాను ఉద్యోగం ఇస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. పార్టీ తరపున రూ.15 లక్షల చెక్, కంచర్ల శ్రీకాంత్ రూ.లక్ష, రాష్ట్ర మైనారిటీ సెల్ అ?ధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ ప్రకటించిన రూ.50,000 కలిపి చంద్రబాబు విజయ కుటుంబానికి అందించారు. ఇవిగాక కేంద్రం నుంచి రూ. 2లక్షలు, రాష్ట్రం నుంచి రూ.2 లక్షలు అందుతాయని చెప్పారు.

**ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు**

కందుకూరు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ ఆర్థిక భరోసా ఇచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలతోపాటు మరికొంత సహాయం కూడా అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. పార్టీ తరఫున ఒక్కొక్కరికీ రూ.15 లక్షల చెక్ ఇచ్చిన ఆయన.. కందుకూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత, ఎన్ఆర్ఐ కంచర్ల సుధాకర్ రూ.2 లక్షలు, కందుకూరు ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, అక్కడి పార్టీ నేత ఇంటూరి



రాజేశ్ , టీడీపీ ప్రవాసాంధ్ర-అమెరికా విభాగం తరఫున కోమటి జయరాం, తూర్పు రాయలసీమ టీడీపీ పట్టభద్ర అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, కృష్ణా జిల్లా గుడివాడ పార్టీ నేత శిష్టా లోహిత్ తలో రూ.లక్ష చొప్పున.. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, బొబ్బిలి టీడీపీ నేత బేబినాయన, కృష్ణా జిల్లా టీడీపీ నేత కేశినేని చిన్ని, నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, పొడపాటి సుధాకర్, గుడివాడ టీడీపీ నేత వెనిగండ్ల రామ్మోహన్ రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారని తెలిపారు. ఇవన్నీ కలిపి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు అందించినట్లు అవుతుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కలిశెట్టి అప్పలనాయుడు కూడా ఒక్కో కుటుంబానికి రూ.పది వేల సాయం ప్రకటించారు. మరికొందరు నేతలు, ఎన్ఆర్ఐలు కూడా స్పందిస్తున్నారని చంద్రబాబు తెలిపారు.

**పిల్లల బాధ్యత నేను చూస్తా**

కందుకూరు మండలం ఆత్మకూరు వెళ్లి.. తొక్కిసలాటలో చనిపోయిన దేవినేని రవీంద్రబాబు (72) మృతదేహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన భార్య కాంతమ్మను, కుమారులు రంగారావు, శరత్నాయుడు, మనవడు, మనవరాళ్లను పరామర్శించారు. 'టీడీపీ అండగా ఉంటుంది, పార్టీ కార్యక్రమంలో అసువులు బాసిన కార్యకర్తలను ఎన్నటికీ మర్చిపోం. పార్టీ తరపున రూ.15 లక్షల చెక్కు ఇస్తున్నాం. పార్టీ నుంచి కొందరు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. మీ ఇన్చార్జి నాగేశ్వరరావు చూసుకుంటారు' అని వారితో అన్నారు. మృతుడిది వ్యవసాయ కుటుంబమని.. కొడుకుల పిల్లలు ప్రాథమిక విద్యలోనే ఉన్నారు వారికి పార్టీపరంగా దారి చూపించాలని స్థానిక పార్టీ నాయకులు కోరగా.. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పిల్లలకు చదువులు చెప్పించేలా చూస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# బాపట్ల జాతీయ రహదారి రన్వే పై దిగిన విమానాలు

**అమరావతి,డిసెంబర్29(ప్రజామంటలు):** అత్యవసర సమయాల్లో విమానాలు దిగేందుకు వీలుగా జాయతీ రహదారిపై నిర్మించిన రన్వేపై గురువారం పలు విమానాలు సురక్షితంగా దిగాయి. ఈ మేరకు ఏపీలోని బాపట్ల జిల్లా రేణింగవరం-కొరిశపాడు మధ్య నాలుగు కిలోమీటర్ల రన్వేపై కార్గో, ఫైటర్ జెట్ విమానాలు ల్యాండింగ్ ట్రయల్ రన్ను విజయవంతం నిర్వహించారు. ముఖ్యంగా 16వ నెంబర్ జాతీయ రహదారిపై అత్యవసర సమయాల్లో విమానాలు దిగేందుకు వీలుగా ఇప్పటికే ఏపీలోని రెండు ప్రాంతాల్లో రన్వేలు నిర్మించారు. వరదలు, భూకంపాలు, ప్రకృతి విపత్తులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు సైతం క్షేమంగా నేలపైకి దిగడానికి వీలుగా రన్వేలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 19 చోట్ల అత్యవసర ల్యాండింగ్ కోసం ఏర్పాట్లు చేయగా ఆంధ్రప్రదేశ్లో ప్రకాశం జిల్లా సింగరాయకొండ-కలికివాయి, బాపట్ల జిల్లా రేణింగవరం-కొరిశపాడు మధ్య హైవే మీద రన్వేలు సిద్ధం చేస్తున్నారు. గురువారం రేణింగవరం-కొరిశపాడు మధ్య ఐదు విమానాల ను ట్రయల్రన్ను సంబంధిత అధికారులు నిర్వహించారు.



# శ్రీశైలంలో దత్తాత్రేయుడికి విశేష పూజలు !

**అమరావతి,డిసెంబర్29(ప్రజామంటలు):** శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం లోక కల్యాణం కోసం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద గల శ్రీ దత్తాత్రేయ స్వామికి వేద పండితులు, అర్చకులు విశేష పూజలు చేశారు. ప్రతి గురువారం దేవస్థానం కైంకర్యంగా శ్రీ దత్తాత్రేయ స్వామికి ఈ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నిర్విఘ్నంగా ఈ పూజ కార్యక్రమం సాగేందుకు తొలుత మహా గణపతి పూజ చేశారు. అటుపై దత్తత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. లోకోద్దరణ కోసం బ్రహ్మ,



విష్ణు, మహేశ్వరలు ఒకే స్వరూపంలో దత్తాత్రేయుడిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపుడిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా, శ్రీశైల క్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గరి సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద దత్తాత్రేయ స్వామి తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షం అని పేరు.కాగా, దత్తాత్రేయ స్వామి వారు కలియుగంలో గోదావరి నదీ తీరానా పీఠాపురంలో శ్రీపాద వల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైల క్షేత్రంలోనే చాతుర్మాస వ్రతాన్ని ఆచరించినట్లు గురు చరిత్రలో పేర్కొన్నారు. కాగా, శ్రీ పాద వల్లబుడు తన శిష్యులకు ఆయా తీర్థ క్షేత్రాల మహిమా విశేషాలను వెల్లడించే సందర్భంలోనూ శ్రీశైలం గురించి పలుసార్లు వెల్లడించారు. శ్రీపాద వల్లభుడి జన్మ తర్వాత మహారాష్ట్రలోని కరంజీ నగరంలో నృసింహా సరస్వతి స్వామిగా దత్తాత్రేయ స్వామి జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి నాడు శ్రీశైల మల్లిఖార్జునుడిని సేవించినట్లు కూడా గురు చరిత్ర చెబుతున్నది. నృసింహ సరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళ గంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజురోజుకు ఎక్కువ కావడంతో నృసింహ సరస్వతి స్వామి అదృశ్య రూపంలో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దీంతో భౌతిక దేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదలీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహ సరస్వతి స్వామి వారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చుని, కృష్ణా నదిలో ప్రవేశించి, కొంత దూరం ఆ ఆకులపైనే పయనిస్తూ అదృశ్యమైనట్లు గురు చరిత్ర చెబుతున్నది

## పురుగు మందుతో
# 16 మంది కూలీలకు తీవ్ర అస్వస్థత..
### ఆస్పత్రికి తరలింపు

**అమరావతి,డిసెంబర్29(ప్రజామంటలు):** బాపట్ల జిల్లా పర్చూరు మండలం చిన్న నందిపాడులో 16 మంది వ్యవసాయ కూలీలు తీవ్ర



అస్వస్థతకు గురయ్యారు. చిలకలూరిపేట మండలం దండమూడి గ్రామానికి చెందిన కూలీలు గురువారం పొలం పనుల నిమిత్తం చిన్న నందిపాడుకు వచ్చారు. పంట పొలంలో పురుగు మందులు చల్లిన కూలీలతో సహ పక్కనే పనిచేస్తున్న మరికొందరు కూలీలు ఒక్కసారిగా అస్వస్థతకు లోనయ్యారు. దీంతో స్థానికులు వారిని హుటాహుటినా గుంటూరు జిల్లా పెద్ద నందిపాడు ఆస్పత్రిలో చేర్పించారు. వారిని పరీక్షించిన వైద్యులు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్కు తరలించి చికిత్స అందజేస్తున్నారు.

## శ్రీవారి సర్వదర్శనానికి
# 24 గంటల సమయం

**తిరుమల, డిసెంబర్29(ప్రజామంటలు):** : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. 19 కంపార్టుమెంట్లలో భక్తులు శ్రీవారి సర్వదర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం కలుగుతుంని అధికారులు తెలిపారు. నిన్న 71,299 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 28,288 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.26 కోట్లు



వచ్చిందని వివరించారు. నూతన ఆంగ్ల సంవత్సరాది జనవరి 1న, వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు సామాన్య భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ అదనపు ఈవో వీరబ్రహ్మంతో కలిసితిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్మెంట్లు, సర్వదర్శనం క్యూలైన్లు, పీఏసీ-4 తదితర ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు వైకుంఠం క్యూకాంప్లెక్సు, నారాయణగిరి షెడ్లు, ఇతర ప్రాంతాల్లో అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, కాఫీ విస్తృతంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు. భక్తులు తిరుపతిలో టైంస్లాట్ టోకెన్లు పొంది వైకుంఠ ద్వార దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు. దీని వల్ల త్వరితగతిన దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు.

# ఇండస్ట్రీలో పెద్దరికం చెలాయించే ఉద్దేశం లేదు

## చిన్నవాళ్లుగా చెప్పకుంటూ తనను పెద్ద చేస్తున్నారు

## చిత్రపురి కాలనీ ప్రారంభోత్సవంలో చిరంజీవి వ్యాఖ్య

ఇండస్ట్రీలో పెద్దరికం చెలాయించాలన్న ఉద్దేశం తనకు లేదని, తనకు ఎలాంటి కుర్చీలూ వద్దని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. కొందరు చిన్నవాళ్లమని చెప్పుకుంటూ తనను పెద్ద చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ చిత్రపురి కాలనీలో డబుల్ బెడ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్హులైన సినీ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సినీ పరిశ్రమ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్స్, సినీ వర్కర్స్, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్మికులకు అవసరం వచ్చినప్పుడు తప్పకుండా భుజంకాస్తానని చిరంజీవి భరోసా ఇచ్చారు. చిత్రపురి కాలనీ నిర్మాణంలో అవకతవకలు జరిగిన విషయం తనకు తెలియదని అన్నారు. అందుకే దానిపై మాట్లాడనని అన్నారు. చిత్రపురి కాలనీలో నూతన గృహా సముదాయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలుగు సినీ కార్మికులకు గృహాసముదాయం ఏర్పడిందని అన్నారు. సినీ కార్మికులకు చేదోడువాదోడుగా ఉంటానని, ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తాను సపోర్ట్ గా ఉంటానని హామీ ఇచ్చారు. సినీ కార్మికులకు సొంత ఇల్లు ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని చిరంజీవి, ఎంతో కష్టపడి గృహ సముదాయాన్ని పూర్తి చేసిన అనిల్ , దొరైలను ప్రశంసించారు. బిజీగా ఉన్నప్పటికీ కార్యక్రమం ప్రత్యేకత తెలిసి అన్ని పనులూ వాయిదా వేసుకొని వచ్చానని చిరంజీవి అన్నారు.. సినీ కార్మికులకు సొంత గృహం ఉండటం ఎంతో అవసరమన్న ఆయన... ఎం. ప్రభాకర్ రెడ్డి దూరదృష్టి వల్లే కార్మికుల కల సాకారమైందని చెప్పారు. ఎంతో నీతి, నిజాయతీతో వల్లభనేని అనిల్ కమిటీ గృహా సముదాయాన్ని పూర్తి చేసిందన్నారు. ఈ రోజు గృహప్రవేశం చేసుకోవడం వెనక చాలా మంది సహకారం, ఎంతో మంది కృషి ఉందని చిత్రపురీ కాలనీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ చెప్పారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, మెగాస్టార్ చిరంజీవి, చదలవడా శ్రీనివాస్ సహాయం ఎంతో చేశారన్నారు. దాసరి నారాయణ రావు తర్వాత మెగాస్టార్ చిరంజీవి అండగా ఉన్నారని, ఈరోజు కూడా రూ.130కోట్ల లోటు బడ్జెట్ తో సొసైటీ ఉందని తెలిపారు. చిత్ర పూరీ కాలనీ గురించి ఎన్నో ధర్నాలు జరిగాయన్నారు. కానీ ఎక్కడా ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. ఇందులో ఉండేది సినీ కార్మికులని, 65ఎకరాల్లో కట్టిన ఈ కాలనీకి మంచి నీటి సదుపాయం కల్పించాలని కోరారు. మెగాస్టార్ చిరంజీవి చేతులు మీదుగా లబ్ధి దారులు ఇంటి తాళాలు అందుకున్నారని చెప్పారు.




# రష్మిక వ్యాఖ్యల వివాదం

## ట్రోల్ చేస్తూ ఆడుకుంటున్న నెటిజన్లు



ఈ మధ్య రష్మిక కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారుతుంది. పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ట్రోలింగ్ గురవుతుంది. తాజాగా ఈ బ్యూటీ సౌత్ సినిమాలపై చేసిన కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం రష్మిక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తుంది. కాగా ఆమె నటించిన 'మిషన్ మజ్ను' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస ప్రమోషన్‌లు జరుపుతుంది. తాజాగా రష్మిక ఈ సినిమా ప్రమోషన్‌ల కోసం ముంబైకి వెళ్లింది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుండి 'రబ్బా జాండా' అనే రొమాంటిక్ పాటను చిత్రబృందం తాజాగా రిలీజ్ చేసింది. ఇక సాంగ్ ఈవెంట్‌లో రష్మిక మాట్లాడుతూ రొమాంటిక్ సాంగ్స్ తెరకెక్కించడంలో బాలీవుడ్ ది బెస్ట్ అని తెలిపింది. అంతటితో ఆగకుండా సౌత్ సినిమాల్లో ఇలా ఉండదని.. సౌత్‌లో ఎక్కువగా మాస్ మసాలా, ఐటెమ్ సాంగ్స్ ఉంటాయని సౌత్ ఇండస్ట్రీని తక్కువ చేసి మాట్లాడింది. దాంతో నెటీజన్లు రష్మికపై మండిపోతున్నారు. సోషల్ మీడియాలో రష్మికను తెగ ట్రోల్ చేస్తూ.. కన్నడ నుంచి తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తున్న సమయంలో కన్నడ సినిమాలను తక్కువ చేసి మాట్లాడావు, ఇక ఇప్పుడు హిందీ సినిమాలలో నటించేటప్పటికి సౌత్‌ని తక్కువ చేసి మాట్లాడుతున్నావ్. ఇది కరెక్ట్ కాదని, నోరును అదుపులో పెట్టుకోవాలని కామెంట్స్ చేస్తూ ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తున్నారు.



# తదుపరి చిత్రంపై పవన్ దృష్టి

పవన్ కళ్యాణ్ ప్రస్తుతం క్రిష్ డైరెక్షన్‌లో 'హరిహర వీరమల్లు' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవలే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేశారు. ఇది పూర్తి స్థాయి ప్యాన్ ఇండియా సినిమా అని, సౌత్ ప్రేక్షకులకు ఎంతగా నచ్చుతుందో నార్త్ ఇండియన్స్‌కూ అంతే నచ్చుతుందని నిర్మాత ఏ.ఎం.రత్నం చెబుతున్నారు. ఇది పూర్తయ్యాక పవన్ షూటింగ్ స్టార్ట్ చేయబోయే నెక్ట్స్ మూవీ ఏమిటనే విషయంపై ఆసక్తి నెలకొంది. మేనల్లుడు సాయిధరమ్ తేజ్‌తో కలిసి 'వినోదయ సిత్తం' రీమేక్‌లో పవన్ నటించాల్సి ఉంది. హరీష్ శంకర్ డైరెక్షన్‌లో తెరకెక్కాల్సిన చిత్రం ఎప్పటినుండో అభిమానులను ఊరిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే ఈ మూవీకి 'ఉస్తాద్ భగత్‌సింగ్' అనే టైటిల్ ÷నైల్ చేయడంతో పాటు ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. మరోవైపు 'సాహో' ఫేమ్ సుజీత్ డైరెక్షన్‌లోనూ ఓ సినిమాను అనౌన్స్ చేశారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత డీవీవీ దానయ్య నిర్మించబోతున్న సినిమా ఇది. ఈ మూడింటిలో ఏది ముందుగా సెట్స్‌కు వెళుతుందనేదే అసలు ప్రశ్న. అయితే 'వినోదయ సిత్తం' రీమేక్‌ను ముందుగా స్టార్ట్ చేయబోతున్నట్టు టాక్. మిగతా రెండింటితో పోల్చితే బ్జడెట్‌తో పాటు పవన్ క్యారెక్టర్ డ్యురేషన్ కూడా తక్కువ కనుక దీన్నే ముందుగా పూర్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరిలోనే ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది.

# పవన్ అజ్ఞాతవాసి..మహేశ్ స్పైడర్

## ఆర్థికంగా దెబ్బతీసాయన్న దిల్‌రాజ్



పవన్‌కల్యాణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన 'అజ్ఞాతవాసి'తో చాలా నష్టపోయానని, ఇన్నేళ్ల కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫైనాన్షియల్ డ్యామేజ్ అదే అని దిల్ రాజు చెప్పారు. తాజాగా ఆయన నిర్మించిన ద్విభాషా చిత్రం 'వారిసు'. తమిళ హీరో విజయ్, రష్మిక మందన్నా జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'వారసుడు' టైటిల్‌తో సంక్రాంతి కానుకగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దిల్ రాజు ప్రమోషన్స్ మొదలుపెట్టారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2017లో వచ్చిన 'అజ్ఞాతవాసి' చిత్రాన్ని నైజాంకు డిస్టిబ్యూటర్‌గా వ్యవహరించాను. అదే ఏడాది మహేశ్‌తో తీసిన స్పైడర్' సినిమాను కూడా డిస్టిబ్యూట్ చేశా. రెండూ ఆడలేదు. రెండూ ఒకే సమయంలో బిగ్గెస్ట్ ఫ్లాప్స్ కావడంతో చాలా నష్టపోయా. అయినా తట్టుకుని నిలబడ్డాను. ఇదే పరిస్థితి మరో నిర్మాతకు ఎదురైతే ఆత్మహత్య చేసుకునేవారు. లేదా ఇండస్ట్రీ నుంచి పారిపోయేవారు. అదే ఏడాదిలో నిర్మాతగా 6హిట్స్ రావడంతో నేను నిలబడగలిగాను అని దిల్ రాజు చెప్పారు. ఇప్పుడు ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.





# నేడు విడుదలవుతున్న లక్కీ లక్ష్మణ్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్, మోక్ష జంటగా ఎ.ఆర్.అభి దర్శకత్వంలో హరిత గోగినేని నిర్మించిన చిత్రం 'లక్కీ లక్ష్మణ్' శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో సోహైల్ మాట్లాడాడు. 'ఇది ఫ్యామిలీ సబ్జెక్ట్. కుటుంబంతో కలిసి చూడదగ్గ చిత్రం. ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకు నవ్వుతారు. డైరెక్టర్ అభి చాలా బాగా తీశారు. ప్రేక్షకులే నా ధైర్యం. వాళ్లంతా నా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నాడు. అనంతరం దర్శకుడు హరిత గోగినేని మాట్లాడారు 'సోహైల్‌తో సహా సినిమాలోని ప్రతీ పాత్రకు సెకండ్ చాయిస్ లేదు. ఆ విషయంలో నేను చాలా లక్కీ. థియేటర్ నుంచి బయటకు వచ్చాక మంచి సినిమా చూశామని ఫీల్ అవుతారు' అన్నాడు. 'బ్జడెట్ పరంగా చిన్న సినిమానే అయినా కంటెంట్ పరంగా పెద్ద సినిమా. తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో థియేటర్లో రిలీజ్ చేస్తున్నాం' అని నిర్మాత అన్నారు. దర్శకనిర్మాతలకు హీరోయిన్ మోక్ష థ్యాంక్స్ చెప్పింది. నటులు రాజా రవీంద్ర, సమీర్, దేవీ ప్రసాద్, రాహుల్ సిప్లిగంజ్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సాయి రాజేష్, ఆర్పీ పట్నాయక్ పాల్గొని టీమ్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు.



# అనుపమ చిత్రం...

## బటర్‌ఫ్లై హాట్‌స్టార్‌లో రిలీజ్

ఓ వైపు గ్లామర్ పాత్రలు పోషిస్తేనే.. మరోవైపు నటన ప్రాధాన్యమున్న పాత్రలతో మెప్పిస్తుంది మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరణ్. ఈ ఏడాది 'రౌడీ బాయ్స్'తో మంచి ఆరంభం దక్కకపోయిన.. ద్వితియార్థంలో వచ్చిన 'కార్తికేయ-2'తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇటీవలే రిలీజైన '18పేజీస్'తో మరో విజయం సాధించింది. ప్రస్తుతం ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఇక ఇదిలా ఉంటే అనుపమ నటించిన లేటెస్ట్ మూవీ బటర్ ఫ్లై నేరుగా ఓటీటీలో రిలీజైంది.సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం గత రాత్రి నుండి హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ ఏడాది ప్రథమార్థంలోనే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం రిలీజ్ డేట్ పలుసార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో హాట్‌స్టార్ నుండి మంచి ఆఫర్ రావడంతో మేకర్స్ ఓటీటీ వైపు మొగ్గుచూపారు. ఘంటా సతీష్‌బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిహాల్ కోదత్య, భూమిక చావ్లా కీలక పాత్రల్లో నటించారు. జెన్ నెక్ట్స్ మూవీస్ బ్యానర్‌పై రవిప్రకాష్ బోడపాటి, ప్రసాద్ తిరవళ్లూరి, ప్రదీప్ నల్లిమెల్లి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు.

# రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రాజయోగం

సాయి రోనక్, అంకిత సాహా జంటగా రామ్ గణపతి రూపొందించిన చిత్రం 'రాజయోగం'ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయి రోనక్ మాట్లాడుతూ 'ఇదొక రొమాంటిక్ ఎంటర్ టైనర్. రెండు గంటలు హాయిగా నవ్వుకునేలా ఉంటుంది. డ్రైవర్‌గా కనిపిస్తా. ఓనర్ స్థానంలో ఒక అమ్మాయిని కలిసేందుకు పెద్ద హోటల్‌కు వెళ్తా. నేను రిచ్ అని ఆమె, ఆ అమ్మాయికి డబ్బుందని నేను అంచనాలు పెంచుకుంటాం. ఈ డ్రామా చివరకు ఎలా ముగిసింది అనేది కథ. పదివేల కోట్లు విలువైన డైమండ్స్ అనే పాయింట్ కూడా ఆసక్తి రేపుతుంది. ఫైట్స్, డాన్స్ లాంటి అన్ని కమర్షియల్ అంశాలుంటాయి. రొమాంటిక్ సీన్స్ ఉన్నా ఇబ్బంది పెట్టేలా ఉండవు. నేను కొందరు స్టార్స్‌కు డ్యాన్సులు నేర్పించా. ఆ స్కిల్ చూపించే అవకాశం ఇందులో దక్కింది. ఒకే జానర్‌కు ఫిక్స్ అవకుండా డిఫరెంట్ జానర్ మూవీస్ చేస్తున్నా. నీలకంఠ డైరెక్ట్ చేస్తున్న థ్రిల్లర్‌తో పాటు ఉషాకిరణ్ బ్యానర్‌లో ఓ సినిమా, అవికా గోర్‌తో 'పాప్ కార్న్' అనే సినిమా చేస్తున్నా. ఇవన్నీ నాకు వెర్సటైల్ ఆర్టిస్ట్‌గా పేరు తెస్తాయని ఆశిస్తున్నా' అన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com